

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

అన్నమయ్య

జిల్లా వార్తలు

బుధవారం 14 మే 2025


పిచ్చలవాండ్లపల్లె సమీపంలో నిర్మిస్తున్న ప్రాజెక్టు (ఫైల్)


భూ పరిహారం

కొందరికేనా..?

- రూ.125 కోట్లకు గానూ రూ.1.66 కోట్లు ఇచ్చారు
- మిగిలిన బాధితుల పరిస్థితి ఏంటి..
- ప్రాజెక్టు కోసం రైతులు సర్వం కోల్పోయారు
- దాదాపు మూడొంతుల పనులు పూర్తి
- నీటమునగనున్న నాలుగు గ్రామాలు

కురబలకోట, మే 13 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికార దుర్వినియోగానికి పాల్పడి అనుమతులు లేకున్నా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కున్నారు. ఆ రైతులకు పరిహారం గురించి మాత్రం ఆలోచించలేదు. వందలాది మంది రైతులు ఏళ్ల తరబడి పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూములను ఇవ్వడానికి నిరాకరించిన రైతులను పోలీసులు, రెవెన్యూ అధికారులతో రకరకాలుగా బెదిరించి బలవంతంగా లాక్కున్నారు. కాంట్రాక్టర్‌లకు లబ్ధి చేకూర్చడానికి చేపట్టిన ప్రాజెక్టును ఎటువంటి అనుమతులు లేకుండానే రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిర్మాణ పనులు చేశారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా వాటిని ఏమాత్రం ఖాతరు చేయకుండా దాదాపు 3 వంతులకు పైగా పనులు పూర్తి చేశారు. అనంతరం గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో ఎక్కడిపనులు అక్కడే ఆగిపోయాయి. తంబళ్లపల్లె నియోజకవర్గం ముదివేడు సమీపంలో రూ.759.50 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ప్రాజెక్టు నిర్మాణం దాదాపు పూర్తి కావస్తున్నా ప్రభుత్వం నుంచి భూనిర్వాసితులకు రావాల్సిన భూపరిహారం, పునరావాసం ఇప్పటి వరకు రాలేదు. అయితే ఇటీవల కేవలం కొద్దిమంది భూబాధితులకు నష్టపరిహారం మంజూరు చేశారు. కాగా నిర్వాసితులకు రూ.125 కోట్లకు గానూ రూ.1.66 కోట్లు మాత్రమే రైతుల అకౌంట్లలోకి జమ చేశారు. ఇలాంటి తరుణంలో ప్రాజెక్టు కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు ఏమాత్రం న్యాయం జరుగుతుందోనని ఆశతో ఎదురుచూస్తున్నారు.

గత వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రభుత్వం రూ.2 వేల కోట్ల రూపాయలకు పైగా అంచనా వ్యయంతో పుంగనూరు నియోజకవర్గంలోని ఆవులపల్లె, నేతిగుంటపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లె పంచాయతీలో ప్రాజెక్టులకు ప్రభుత్వం 2021లో అనుమతులు మంజూరు చేసింది. కాగా వీటిలో ముదివేడు రిజర్వాయర్‌ను రూ.759.50 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించారు. కాగా ఈ ప్రాజెక్టును కురబలకోట, బి.కొత్తకోట మండలాల పరిధిలో 1077 ఎకరాలలో నిర్మిస్తున్నారు. ప్రాజెక్టు కోసం వ్యవసాయ భూములు, గ్రామాలు, చెరువులు, కుంటలను కోల్పోతున్నారు. కాగా కురబలకోట మండలంలోని పిచ్చలవాండ్ల పల్లె పంచాయతీలో 798.7 ఎకరాలు, కురబలకోట పంచాయతీలో 66.70 ఎకరాలు, ముదివేడు పంచాయతీలో 64.95 ఎకరాలు బి.కొత్తకోట మండలంలోని కోటావూరు పంచాయతీలో 146.05 ఎకరాలు ప్రాజెక్టు నిర్మాణం కోసం ఎంపిక చేసింది. కాగా భూములకు సంబంధించి పలుమార్లు కలెక్టర్, జేసీ, మండల స్థాయి అధికారులు, ఎమ్మెల్యే, ఎంపీలు రైతులతో సమావేశం నిర్వహించి భూపరిహారం పట్టా, డీకేటీ భూములకు ఎకరానికి రూ.12.50 లక్షలుగా ఒకే ధరను నిర్ణయించారు. కాగా కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లె పంచాయతీలోని శీతివారిపల్లె, కొత్తపల్లె, బి.కొత్తకోట మండలం కోటావూరు పంచాయతీలోని చౌటకుంటపల్లె, దిన్నెమీదపల్లె గ్రామాలు పూర్తిగా నీట మునగనున్నాయి. అయితే వీరికి పునరావాసాల కోసం పిచ్చలవాండ్లపల్లె పంచాయతీలో 204 కుటుంబాలు, కోటావూరు పంచాయతీలో 125 కుటుంబాలను ఎంపిక చేశారు. అయితే ప్రాజెక్టు నిర్మాణ పనులకు భారీగా మట్టి అవసరం కావడంతో దాదాపు 400 ఎకరాలకు పైగా పొలాలలోని మట్టిని యంత్రాల సహాయంతో పెద్దపెద్ద గుంతలు పెట్టి ఆ మట్టిని కట్ట నిర్మాణ పనుల కోసం తరలించి పొలాలను ఎందుకూ పనికి రాకుండా చేశారు. కాగా 400 ఎకరాలకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున గుత్త ఇస్తామని నమ్మబలికారు. అయితే కేవలం ఏడాది మాత్రం ఇచ్చి ఆ తర్వాత గుత్త సొమ్ము ఇవ్వలేదు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం మారడంతో ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములను కోల్పోయిన భూనిర్వాసితులకు భూపరిహారం ప్రశ్నార్థకంగా మారింది. కాగా 524 మంది రైతులకు గానూ రూ.125 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయితే పలుమార్లు ఆంధ్రజ్యోతిలో భూబాధితుల కథనాలు ప్రచురితం కావడంతో ప్రభుత్వం స్పందించింది. భూములు కోల్పోయిన బాధితులు 25 మంది రైతులకు పార్ట్ బిల్లుల కింద రూ.1.66 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారు. అది కూడా రూ.15 లక్షల లోపు బిల్లులు రావాల్సిన వారికి మాత్రమే చెల్లించారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో మిగిలిన రైతులకు పరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరుతున్నారు.


ప్రాజెక్టుకు మట్టి తరలించడంతో గుంతలమయమైన పొలాలు

ఆర్‌అండ్‌ఆర్ పరిస్థితి ఏంటి..

ప్రాజెక్టు కోసం భూములను కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని మంజూరు చేస్తుంది. ఇందులో భాగంగా భూములు, ఇళ్లను కోల్పోయిన బాధితుల కోసం ప్రత్యేకంగా స్థలాలను మంజూరు చేసి ఇళ్ల నిర్మాణాలను చేపడతారు. కాగా కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లె పంచాయతీలోని భూనిర్వాసితుల కోసం ముదివేడు క్రాస్ సమీపంలోని తానామిట్ట వద్ద 21.50 ఎకరాలను, బి.కొత్తకోట మండలంలోని కోటావూరు పంచాయతీలో నిర్వాసితుల కోసం 13.50 ఎకరాలను ఎంపిక చేసింది. కాగా ఒక్కొక్క కుటుంబానికి 5 సెంట్ల జాగాతో పాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తుంది. ఇదిలా ఉండగా ఇంటి నిర్మాణాన్ని సొంతంగా నిర్మించుకునే వారికి రూ.10 లక్షలు, అలా కాకుండా ఇళ్లు నిర్మించుకోలేని వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణాలను చేపట్టి వారికి అప్పగించడంతో పాటు మిగిలిన నగదును వారికి అందజేస్తారు. అయితే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి పలుమార్లు జిల్లా, మండల స్థాయి అధికారులు భూనిర్వాసితులతో సమావేశాలు నిర్వహించారు. అయితే త్వరలో స్థలాలు కేటాయించడంతో పాటు ఆ ప్యాకేజీని ఇవ్వనున్నట్లు చెప్పినా ఇప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. ఇలాంటి తరుణంలో వారి సొంతింటి కల ఎప్పుడు నెరవేరుతుందో అంతుబట్టడం లేదు.

ప్రభుత్వానికి నివేదిక అందజేశాము

మండలంలోని పిచ్చలవాండ్లపల్లె పంచాయతీలో చేపడుతున్న ప్రాజెక్టుకు సంబంధించి పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ పునరావాసాలకు సంబంధించి పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు రైతులకు సంబంధించిన భూములకు పరిహారం నిర్ణయించి, వివరాలను పూర్తిగా సేకరించి సంబంధిత శాఖాధికారులకు అందజేశారు. అంతేకాకుండా ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికే కొంతమంది రైతుల ఖాతాల్లోకి పరిహారం జమ చేశారు. మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూసి ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం.

- తపశ్విని, తహసీల్దార్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ ఉషశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ఉషశ్రీ

రాయచోటిటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బ, వడగాలులకు గురి కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇప్పటికే వాతావరణ శాఖ వడగాలులు, వడదెబ్బలపై హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎండల తీవ్రత వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి మెదడు మీద ప్రభావం చూపుతుందన్నారు. దీనివల్ల మెదడులోని ఉష్ణోగ్రత నియంత్రణ చేసే కేంద్రం (హైపోతలామస్) దెబ్బతిని వడదెబ్బకు గురైతే ప్రాణాంతకం అన్నారు. వడగాలులకు, వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో తిరగకూడదన్నారు. మత్తు పానీయాలు తీసుకోకూడదని, రోడ్డు మీద అమ్మే కలుషిత ఆహారం, రంగు, రంగుల పానీయాలు తీసుకోరాదన్నారు. వడదెబ్బకు గురికాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మంచినీరు, పళ్లరసాలు, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. రానున్న 3వ శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఈనెల థీమ్ 'బీట్ ద హీట్' అని రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసిందని, కావున ఆ కార్యక్రమంలో అన్ని పీహెచ్‌సీల, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో వడదెబ్బ, వడగాలులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి కరపత్రాలు పంపిణీ చేస్తామని తెలిపారు.

జవాన్ భూమిని పరిశీలించిన ఎమ్మెల్యే

- రెండు రోజుల్లో సర్వే చేసి నివేదిక ఇవ్వండి


చిట్టెంవారిపల్లెలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

రామసముద్రం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టెంవారిపల్లెకు చెందిన ఆర్మీ జవాన్ మోహన్ కుటుంబానికి చెందిన భూమిని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మంగళవారం పరిశీలించారు. ఇందుకు సంబంధించిన రికార్డుల వివరాలను తహసీల్దార్ నిర్మలాదేవిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం భూవివాదానికి సంబంధించి ఇరువర్గాల వాదనలు విన్న ఎమ్మెల్యే మొత్తం భూమిని సర్వే చేసి రెండు రోజుల్లో తనకు నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. సర్వే రిపోర్ట్ వచ్చిన తర్వాత బాధితులకు తగిన న్యాయం చేస్తామని, అంతవరకు ఇరువర్గాల వ్యక్తులు ఘర్షణ పడకుండా ఉండాలని తెలిపారు.

ఆదాయం, ఆనందం, ఆరోగ్యం

- ముప్పావు ఎకరాలో 110 రకాల పండ్ల మొక్కల పెంపకం
- విజయం సాధించిన పీలేరు రైతు

6



వైభవంగా పునఃప్రతిష్ఠ మహోత్సవం


ప్రత్యేక అలంకరణలో రెడ్డెమ్మ అమ్మవారు


కలశ స్థాపన పూజలు చేస్తున్న అర్చకులు

గుర్రంకొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మిగా పేరుగాంచిన రెడ్డెమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని వేద పండితులు మంగళవారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. మొదటిరోజు ఉదయాన్నే ఆలయంలో మాతృకా పూజ, పంచగవ్య ప్రాసనం, దీక్షా కంకణధారణ, ప్రధాన కలశస్థాపన, మహా మంగళహారతి పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో అలంకరించి సాయంత్రం ప్రదోష పూజ, అంకురార్పణ, మూల మంత్రం, గణపతి హోమం, అధివాస హోమం తదితర కార్యక్రమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులకు దాతలు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఈవో మంజుల, సర్పంచ్ ప్రేమకుమారి, ఎంపీటీసీ రెడ్డివరప్రసాద్‌నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం

- డీపీటీవో కార్యాలయం వద్ద ఉద్యోగుల నిరసన



రాయచోటిలోని జిల్లా ప్రజా రవాణా శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

రాయచోటిటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం ఆగదని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జోనల్ అధ్యక్షుడు వినోద్‌బాబు హెచ్చరించారు. మంగళవారం జిల్లా డీపీటీవో కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో జిల్లాలోని ఐదు డిపోల నుంచి సుమారు 250 మందికిపైగా సిబ్బంది పాల్గొని జెండాలు, బ్యానర్లతో నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా జోనల్ అధ్యక్షుడు వినోద్‌బాబు మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగులను చిన్న చిన్న కారణాలతో అధికారులు వేధించడం తగదని, ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని సిబ్బందికి రావాల్సిన ప్రమోషన్లు వెంటనే కల్పించాలని, మహిళా సిబ్బందికి, వారికి రావాల్సిన చైల్డ్ కేర్ లీవ్‌లు వెంటనే మంజూరు చేయాలని, గ్యారేజ్ సిబ్బందిపై వేధింపులు తగ్గించాలని డిమాండ్ చేశారు. రీజనల్ కార్యదర్శి పీఎస్ఎం రాజు మాట్లాడుతూ సంస్థలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, అన్ని కేటగిరీల్లో ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని, నైట్ అవుట్ అలవెన్సులను పెంచాలని కోరారు. కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ రీజనల్ ప్రెసిడెంట్ ఎంఎస్ రావు, రీజనల్ మహిళా నాయకురాలు విజయేశ్వరి, అన్ని డిపోలు, గ్యారేజ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు, అధిక సంఖ్యలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కమనీయం లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

- భక్తులతో పోటెత్తిన భువనగిరి లక్ష్మీనరసింహ ఆలయం


స్వామి కల్యాణోత్సవంలో మాంగల్యాన్ని చూపుతున్న వేదపండితులు

రాజంపేట టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : భువనగిరిపల్లె లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నరసింహస్వామి కల్యాణం అశేష భక్తజన సందోహం నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణానికి మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య కుమారుడు పసుపులేటి వీరప్రదీప్‌కుమార్ దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను అందజేశారు. జనసేన రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ స్వామి వారికి పట్టువస్త్రాలను అందజేశారు. లక్ష్మీ సమేత నరసింహస్వామి వారిని ప్రత్యేక అలంకరణలో కొలువుదీర్చి కల్యాణవేదికపై కూర్చొబెట్టి సంప్రదాయబద్ధంగా వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ తంతును నిర్వహించారు. కల్యాణం అనంతరం ముత్యాల తలంబ్రాల కోసం పోటీ పడడంతో పోలీసులు అదుపు చేశారు. ఈ కల్యాణ మహోత్సవానికి మూడో అదనపు జడ్జి ప్రవీణ్‌కుమార్, కడప సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష, రాజంపేట పట్టణ సీఐ రాజా దంపతులతో పాటు జిల్లా నలుమూలల నుంచి పలువురు నేతలు, అధికారులు భువనగిరి గ్రామ ప్రజలు, రాజంపేట పట్టణ ప్రజలు పెద్దఎత్తున హాజరై భక్తి శ్రద్ధలతో స్వామివారి కల్యాణాన్ని తిలకించి పరవశించారు. కల్యాణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ సీఐ రాజా, ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు.


కల్యాణోత్సవానికి ముత్యాలు, పట్టువస్త్రాలు తీసుకువస్తున్న పసుపులేటి ప్రదీప్ దంపతులు


కల్యాణానికి హాజరైన భక్తులు

బదిలీలకు రంగం సిద్ధం

- మరో రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో 1800 మందికి పైగా ఉపాధ్యాయులకు స్థానచలనం



కడప ఎడ్యుకేషన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాకు సంబంధించి బదిలీలకు అవసరమైన ప్రాథమిక సమాచారాన్ని విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ఇప్పటికే అందజేశారు. ఉమ్మడి కడప జిల్లాలో ప్రభుత్వ జడ్పీ, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల పరిధిలో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ ప్రదానోపాధ్యాయుల కేటగిరీలో 9,706 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో దాదాపు 1,800 మందికి పైగా తప్పనిసరిగా బదిలీ కావల్సి ఉంది. మరో వెయ్యి నుంచి 1,200 మందికి అర్హతలను బట్టి బదిలీలు జరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలంటున్నాయి. రెండు మూడు రోజుల్లో బదిలీలకు సంబంధించి పూర్తిస్థాయి నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉంది.

మార్గదర్శకాలు ఇలా

ఏదైన పాఠశాలలో ఐదు సంవత్సరాలు పూర్తిచేసిన గ్రేడ్-1 ప్రధానోపాధ్యాయులు, ఏదైనా పాఠశాలలో 8 ఏళ్లు పూర్తిచేసిన ఉపాధ్యాయులకు బదిలీ ఉంటుంది. కనీసం రెండు సంవత్సరాలు పనిచేసిన ఉపాధ్యాయులకు బదిలీలకు అవకాశం ఉంది. ఏ విద్యాసంవత్సరంలో అయినా మే 31వ తేదీ నాటికి తొమ్మిది నెలలు పనిచేస్తే అది పూర్తి విద్యా సంవత్సరంగా పరిగణిస్తారు. రెండేళ్లలో ఉద్యోగ విరమణ చేసేవారు తమ కోరిక మేరకు మాత్రమే బదిలీ అవుతారు. 50 ఏళ్లలోపు పురుష ఉపాధ్యాయులు బాలికల హైస్కూలులో పనిచేస్తే తప్పనిసరిగా బదిలీ చేయాలి. మహిళా ఉపాధ్యాయులు లేని పరిస్థితుల్లో 50ఏళ్లు పైబడిన పురుష ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వచ్చు. ఎన్‌సీసీ అధికారులైన వారిని సంబంధిత యూనిట్ ఉన్న పాఠశాలకు బదిలీ చేయాలి. లైంగిక వేధింపులు (పోక్సో) కేసులు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులను బాలికల పాఠశాలల్లో లేకుండా ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలి.

పాయింట్లు ఇలా

ఉపాధ్యాయులు మే 31 నాటికి చేసిన సేవ ఆధారంగా పాయింట్లు కేటాయిస్తారు. ఇందులో మొత్తం ఐదు పాయింట్లు ఉంటాయి. జంట ఉద్యోగులుగా ఉన్న దంపతులకు ఐదు పాయింట్లు కేటాయిస్తారు. 40ఏళ్లు దాటి పెళ్లికాని మహిళా ఉపాధ్యాయులకు ఐదు పాయింట్లు, శారీరక మానసిక లోపాలతో ఉన్న వారికి 7పాయింట్లు (లోపశాతం ఆధారంగా), బాధ్యతాయుతంగా ఉన్న సంఘాల నాయకులకు (ఉద్యోగ సంఘాలు) ఐదు పాయింట్లు, తలసేమియా, డయాలసిస్ వంటి వ్యాధులతో బాధపడేవారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారు.

ప్రాధాన్యత కేటగిరీలు

వందశాతం చూపులోపం లేదా 80శాతం పైగా శారీరకలోపం, 75శాతం చూపు లోపం లేదా 70శాతం పైగా వినికిడి లోపం ఉన్నవారికి బదిలీల్లో ప్రాధాన్యత కల్పిస్తారు. విడాకులు తీసుకున్న మహిళలు (పునర్వివాహం అయితే వర్తించదు), తీవ్రమైన అనారోగ్యం ఉన్నవారు (క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ మొదలైనవి), డయాబెటిక్, తలసేమియా బాధిత సంతానం ఉంటే ప్రాధాన్యత కల్పిస్తారు.

1800 మందికి తప్పనిసరి

జిల్లాలో ఎంపీపీ, జడ్పీ యాజమాన్యాలకు సంబంధించి 9016 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రభుత్వ బడుల్లో 177 మంది, మున్సిపాలిటీకి సంబంధించి 513 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించి బదిలీ కోరుకునే ఉపాధ్యాయులకు డిస్ప్లే చేస్తారు. ఈ ఏడాది మే నెలాఖరు వరకు ఉన్న అన్ని ఖాళీలను బదిలీల్లో చూపుతారు. 2020 మే 31కు ముందు పాఠశాలల్లో చేరిన హెచ్ఎంలకు ఐదేళ్లు అదే పాఠశాలల్లో పూర్తవుతున్నందున తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. అలాగే 2017 మే 31కి ముందు పాఠశాలల్లో చేరిన ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లకు ఎనిమిది సంవత్సరాలు పూర్తవుతున్నందున తప్పనిసరిగా బదిలీ కావాలి. అయితే 2027 మే నెలాఖరులోపు ఉద్యోగ విరమణ చేసే ఉపాధ్యాయులకు బదిలీల నుంచి మినహాయింపు ఉండే అవకాశం ఉంది. ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా అన్ని క్యాడర్లకు సంబంధించి 9,706 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో తప్పనిసరి బదిలీలకు సంబంధించి 1,800 మంది దాకా ఉండవచ్చని విద్యాశాఖ అధికారులు తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పూర్తిచేయనున్నారు.

జాతరకు వెళ్లి వచ్చేలోపు చోరీ



చోరీకి గురైన బీరువా

పీలేరు, మే 13(ఆంధ్రజ్యోతి): తెల్లవారుజామున 4 గంటలకు జాతరకు వెళ్లి వచ్చేలోపు ఓ ఇంటిలో చోరీ జరిగిన సంఘటన మంగళవారం పీలేరులో జరిగింది. పీలేరు మండలం వేపుల బైలు గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డి పీలేరులోని చెన్నారెడ్డి కాలనీలో కాపురముంటున్నారు. వేపుల బైలులో సోమవారం రాత్రి, మంగళ వారం ఉదయం జాతర ఉండడంతో అతను తన కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం ఉదయం 4 గంటలకు ఇంటి నుంచి వేపులబైలుకు వెళ్లాడు. జాతరలో అమ్మవారి దర్శనం చేసుకుని 6 గంటలకు ఇంటికి తిరిగి రాగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడం గమనించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి, అందులోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. బీరువాలోని 100 గ్రాముల బంగారు ఆభరణాలు, వ్యాపారం కోసం సరిచేసుకున్న రూ.5 లక్షల నగదు అపహరణకు గురైనట్లు అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీనివాసులరెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బాలకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా కేంద్రం నుంచి వేలి ముద్ర నిపుణులను పిలిపించి సంఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరించారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



సిద్దారెడ్డి (ఫైల్ ఫొటో)

తంబళ్లపల్లె, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నెమడుగు వద్ద శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో గాయ పడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. వివరాల మేరకు... తంబళ్లపల్లె మండలం మర్రి మాకులపల్లె పంచాయతీ గొల్లపల్లెవారిపల్లెకు చెందిన సిద్దారెడ్డి(43) గత శనివారం సొంత పనుల నిమిత్తం స్వగ్రామం నుంచి కన్నె మడుగుకు ద్విచక్ర వాహనంలో వస్తున్నాడు. ఈ క్రమంలో నాయని చెరువు వద్ద పక్క నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో సిద్దారెడ్డి తలకు గాయమైంది. కుటుంబసభ్యులు బాధితుడిని తొలుత తంబళ్లపల్లె సీహెచ్‌సీకి అక్కడి నుంచి మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు. బాధితుడికి మెరుగైన వైద్య చికిత్సలు అవసరమవ్వడంతో బెంగళూరు తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం పరిస్థితి విషమించడంతో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై దాడులు

● టాస్క్‌ఫోర్స్ అదుపులో ఇద్దరు నిందితులు ?

సిద్దవటం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజంపేట సమీపంలోని ఓ పొలంలో ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచగా సోమవారం రాత్రి కడప టాస్క్‌ఫోర్స్ సిద్దవటం అటవీశాఖ, పోలీసుశాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ దాడుల్లో ఎస్.రాజంపేట గ్రామానికి చెందిన ఇద్దరు నిందితులతో పాటు ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఎస్.రాజంపేట ఎస్సీ కాలనీకి చెందిన ఇద్దరు నిందితులు ఎర్రచందనం దుంగలను విక్రయించేందుకు సమాయత్తం అవుతుండగా టాస్క్‌ఫోర్స్ అధికారులు వారిని ట్రాప్ చేసినట్లు తెలుస్తోంది. ఎస్.రాజంపేట సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి తెచ్చిన ఎర్రచందనం దుంగలను చిన్న చిన్నముక్కలుగా చేసి పొలంలో పూడ్చి ఉంచినట్లు తెలిసింది. వాటిని విక్రయించేందుకు సిద్ధపడడంతో విషయాన్ని తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు ఫోన్‌ద్వారా నిందితులను ట్రాప్ చేసినట్లు సమాచారం. ఈ మేరకు పట్టుబడ్డ నిందితులను తిరుపతికి తరలించి విచారిస్తున్నట్లు తెలిసింది. విచారణలో నిందితులు పలు విషయాలు వెల్లడించినట్లు సమాచారం.

ఆదాయం.. ఆనందం.. ఆరోగ్యం

● 'ఫార్మర్స్ పెన్షన్ ప్లాన్'
● ముప్పావు ఎకరాలో 110 రకాల పండ్ల మొక్కల పెంపకం
● ఏడాది పొడవునా ఆదాయం ఉండేలా రూపకల్పన
● ప్రయోగాత్మకంగా చేపట్టి విజయం సాధించిన పీలేరు రైతు



రైతు రత్నశేఖరరెడ్డి వ్యవసాయ క్షేత్రం

పీలేరు, మే 13 (ఆంధ్రజ్యోతి): పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవించే రైతులకు ఏడాది పొడవునా ఆదాయం ఉండడం చాలా తక్కువ. ఎప్పటికప్పుడు మారిపోయే వాతావరణ పరిస్థితుల కారణంగా అనుకోని ఉపద్రవం ముంచుకొచ్చి రైతుకు నష్టం వాటిల్లుతూనే ఉంటుంది. అలా కాకుండా ఏదో ఒక పంట ద్వారా నిత్యం ఎంతో కొంత ఆదాయం సంపాదించుకోవాలని పి.రత్నశేఖర్‌రెడ్డి అనే రైతు 'ఫార్మర్స్ పెన్షన్ ప్లాన్' అనే వ్యవసాయ విధానాన్ని చేపట్టాడు. పండ్ల మొక్క పెంపకం ద్వారా ఏడాదిలోని ప్రతి సీజన్‌లోనూ ఆదాయం పొందవచ్చని తలంచిన ఆయన అనుకున్నదే తడవుగా తన పొలంలోనే ప్రయోగానికి శ్రీకారం చుట్టాడు. దాదాపు రెండేళ్ల పాటు శ్రమించాడు. అతడి కష్టానికి తగ్గ ఫలితం దక్కింది. ప్రస్తుతం అతను తన పండ్ల తోట ద్వారా ప్రతి నెలా కొంత ఆదాయం పొందుతున్నాడు.

ఆదాయం కోసం అనేక ప్రయోగాలు

పీలేరు మండలం వేపులబైలు పంచాయతీ రెడ్డివారి పల్లెకు చెందిన పి.రత్నశేఖరరెడ్డి ఓ ప్రగతిశీల రైతు. నూతన ప్రయోగాలు చేయడంలో ఎప్పుడూ ముందుండేవాడు. తనకు తెలిసినంతలో అతను అనేక ప్రయోగాలు చేసి కొన్నిసార్లు విజయం, కొన్నిసార్లు ఓటమి చవి చూసేవాడు. వ్యవసాయంలో కంటే కోళ్ల, గొర్రెల పెంపకంలో అతనికి బాగా కలిసి వచ్చింది. రైతు కుటుంబం నుంచి వచ్చిన వాడు కావడంతో వ్యవసాయంపై మమకారం చావక వరి, వేరుశెనగ, టమోటా, మామిడి సాగు చేసుకునేవాడు. ఆ క్రమంలో అతనికి 2018లో పీలేరుకు చెందిన ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదేషావలితో పరిచయం ఏర్పడింది. దీంతో వారిద్దరూ 2019లో రత్నశేఖర రెడ్డికి చెందిన కేవలం ముప్పావు ఎకరాలో దోస పంటను సాగు చేశారు. పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటను సాగు చేయడం సాధ్యం కాదని, అందునా మార్చి మాసంలో పంట వేయడం తప్పని తోటి రైతులు రత్నశేఖరరెడ్డిని భయాందోళనకు గురిచేశారు. అయినా ఎవరి మాటలను లెక్క చేయకుండా ముందుకెళ్లాడు. పంట కాలానికి కావాల్సిన కషాయాలు, ఎరువులను ముందుగా సిద్ధం చేసుకుని రంగంలోకి దిగడంతో ఎప్పటికప్పుడు వచ్చిన తెగుళ్లను విజయవంతంగా ఎదుర్కొన్నారు. కేవలం 60 రోజుల పంట అయిన దోసలో రూ.2 లక్షల లాభం గడించారు. అప్పటి నుంచి రత్నశేఖరరెడ్డికి ప్రయోగాలపై గురి కుదిరింది. ఆ తరువాత బోదేషావలి పర్యవేక్షణలో పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వరి సాగు చేసి కేవలం ఎకరా పొలంలో 47 బస్తాల వరి పండించాడు. ఆ తరువాత కాలాలు, సీజన్‌లతో పనిలేకుండా రైతుకు ఎల్లప్పుడూ ఆదాయం వచ్చేలా ఏదైనా పంట రూపకల్పన చేసుకుని ప్రయోగాత్మకంగా తానే పండించాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. అలా తనకున్న ముప్పావు ఎకరా పొలంలో పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఎటువంటి రసాయనిక ఎరువులు వినియోగించకుండా 110 రకాల పండ్ల మొక్కలు, కొన్ని వాణిజ్య మొక్కలను సాగు చేస్తున్నాడు. 'ఫార్మర్స్ పెన్షన్ ప్లాన్' అని దానికి నామకరణం చేసి 2022లో మొక్కల పెంపకం ప్రారంభించాడు. ఖమ్మం, కడియం, రైల్వేకోడూరు, బెంగళూరులోని ఐఏహెచ్ఆర్, హైదరాబాదు ప్రాంతాల నుంచి వివిధ పండ్ల మొక్కలను తెప్పించుకుని తోటను పూర్తిగా సమకూర్చుకోవడానికి ఏడాది సమయం పట్టింది. ప్రస్తుతం అతని తోటలోని పలు పండ్ల మొక్కలు కాపుకు వచ్చాయి.

మినీ వనాన్ని తలపించేలా..

రైతు తోటలో ప్రస్తుతం అరటి (10 చెట్లు), జామ (50), సపోట (15), టెంకాయ (70), డ్రాగన్ ఫ్రూట్ (100), ఆపిల్ బేర్ (15), బత్తాయి (15), చీనీ (6), నేరేడు (10), అవకాడో (2), సీతాఫలం (10), రామాఫలం (1), లక్ష్మణ ఫలం (1), హనుమ ఫలం (2) పనస (5), తీపి చింత (3), నూర్జహాన్ మామిడి (2), ప్యాషన్ ఫ్రూట్ (2), కలింగర కాయ (2), అంజీర (10), బొప్పాయి (20) వంటి పండ్ల మొక్కలు ఉన్నాయి. తోటకు కంచె పంటగా మునగ (20), శ్రీగంధం (50), మహాగని (50 చెట్లు), అంతర పంటలుగా టమోటా, వంకాయ, మిర్చి, బంతి, చామంతి సాగు చేస్తున్నారు. వర్షాకాలంలో వర్షాధారంగా వేరుశెనగ సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నాడు. సీజన్‌ల వారీగా పంట చేతికొస్తున్నాయి. పల్లెలో విక్రయించుకోగా మిగిలిన వాటిని ప్రతి మంగళవారం పీలేరులో జరిగే వారపు సంతలో విక్రయిస్తున్నాడు.

కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం

కేవలం పండ్లపైనే ఆధారపడకుండా రత్నశేఖరరెడ్డి తన తోటలో నాటు కోళ్లను కూడా పెంచుతున్నాడు. తోటలోనే షెడ్డు నిర్మించి క్రమం తప్పకుండా 100 కోళ్లు పెంచుతున్నాడు. తోటలోని వ్యర్థాలను తిని పెరుగుతున్న ఆ కోళ్లు చాలా ఆరోగ్యంగా, బలవర్ధకంగా తయారవుతుండడంతో వాటికి కూడా మంచి ధర పలుకుతోంది. దీంతో రైతు అదనపు ఆదాయం సమకూరుతోంది.

పలువురి సందర్శన

ఈ వ్యవసాయ క్షేత్రాన్ని తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు గడిచిన మూడేళ్లుగా సందర్శిస్తున్నారు. ఆయన తోటలో ఆయన అవలంబిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వ్యవసాయ కళాశాల అధ్యాపకులు తమ విద్యార్థులకు వివరిస్తుంటారు. కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు ఈయన తోటను సందర్శించి అతనికి అనేక సలహాలు, సూచనలు చేస్తున్నారు. అంతేకాకుండా మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న అనేక సంస్థలు తమ రైతులను పలు మార్లు తీసుకువచ్చారు. ఆయన పాటించిన విధానాలను ఆయా రైతులు అవలంబిస్తుంటారు.

పండ్ల తోటతో ఆరోగ్యం, ఆదాయం

● రత్నశేఖరరెడ్డి, రైతు



నికర ఆదాయం లేక పోవడం వల్ల నాలాంటి రైతులు ఎక్కువగా వ్యవసాయాన్ని వదిలేస్తుంటారు. ఇంకో పని చేతకాక వృద్ధాప్యంలో కుటుంబసభ్యుల నుంచి అనేక ఇబ్బందులు పడు తుంటారు. అందుకనే నేను ప్రయోగాత్మకంగా పండ్ల తోటలను చేపట్టాను. పండ్ల తోటలు పెట్టడం కాసింత ఇబ్బంది, కష్టంతో కూడుకున్న పనే అయినా నిరంతరం ఆదాయం పొందుతూ ఉండవచ్చు. కూలీల టెన్షన్ ఉండదు. పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే రసాయనిక ఎరువుల్లో సగం ఖర్చు మిగిలిపోతుంది.

రైతులకు ఇదొక మంచి అవకాశం

● బోదేషావలి, ప్రకృతి వ్యవసాయ నిపుణుడు



చాలా మంది రైతులకు తమ కుటుంబసభ్యుల నుంచి వ్యవసాయానికి సహకారం ఉండదు. విద్య, ఉపాధి కారణంగా పిల్లలు తమ తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్నారు. పిల్లలు దగ్గర లేకపోవడం వల్ల పెద్దవాళ్లు తమ పొలా లను బీళ్లుగా వదిలేయడమో లేక ఇతరులకు లీజుకు ఇచ్చేయడమో చేస్తుంటారు. అటువంటి వారు మిశ్రమ పండ్ల తోటను పెట్టుకోవచ్చు. కూలీల ఖర్చు కూడా తక్కువ. స్వంతంగా ఒకరిద్దరే తోటను పర్యవేక్షించుకోవచ్చు.



రైతు తోటలో కాసిన వాటర్ ఆపిల్ పండ్లు, తోటను సందర్శించిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు (ఫైల్ ఫొటో), తోటలోని బొప్పాయి చెట్టు, డ్రాగన్ ఫ్రూట్ చెట్లు

వసంతోత్సవంతో శోభిల్లిన కోన

● పెంచలోరికి చక్రతీర్థ స్నానం, తెప్పోత్సవం ● ముగిసిన బ్రహ్మోత్సవాలు, నేడు గోనుపల్లికి శ్రీవారు





దేవేరులతో కలిసి పుష్కరిణిలో విహరిస్తున్న పెంచల నారసింహుడు, చక్రస్నానం జరుపుతున్న అర్చకులు

రాపూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): నరసింహుడికి చక్రతీర్థ స్నానం, స్వామివారి సేవ ముందు నృత్యం, వసంతకేళిలో అధికారులు, భక్తులు వసంతోత్సవ శోభతో పెంచలకోన శోభిల్లింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఉత్సవాంతముగా జరిపే పర్వం చక్రతీర్థ మహోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. తొలుత పుణ్యాహవాచన పూజలు నిర్వహించిన పూజారులు వసంతకేళి జరిపారు. అనంతరం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్యచక్రత్ ఆళ్వర్ల స్నాన ఘట్టాలు కొనసాగాయి. మంగళవాయిద్యాల నడుమ అర్చకులు, భక్తజనులు, దేవస్థాన సిబ్బంది తిరువీధి సేవోత్సవంలో పసుపు, కుంకుమ, గంధం, వివిధ సుగంధాలు వెదజల్లే రంగుల్లో వసంతకేళి నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఈవో శ్రీనివాసులు రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల సతీమణి సింధు, అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, అమ్మవారిని, ఆంజనేయ స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆయన వెంట ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, రాపూరు, మర్రిపాడు ఎస్‌ఐలు వెంకట రాజేష్, శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

నయనానందకరంగా తెప్పోత్సవం

మంగళవారం సాయంత్రం ప్రధాన ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా పుష్కరిణికి తీసుకొచ్చారు. అనంతరం రాత్రి 8 గంటల ప్రాంతంలో తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం అశ్వవాహనంపై స్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తర్వాత ఆలయంలో ఎగరవేసిన గరుత్మంతుడి చిత్రపటాన్ని దించి ధ్వజారోహణం కార్యక్రమాన్ని జరిపారు. ఇక చివరిరోజు అయిన బుధవారం రాత్రి గోనుపల్లిలో గ్రామోత్సవం జరగనుంది.

హుండీ ఆదాయం రూ.25,51,088

బ్రహ్మోత్సవాలకు ఏర్పాటు చేసిన హుండీలకు భక్తులు భారీగా కానుకలు సమర్పించినట్లు ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం హుండీలను లెక్కించగా, రూ.25,51,088 నగదు, 38 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి వచ్చినట్లు తెలిపారు. అమెరికా 10 డాలర్లు, కువైట్ 7.5 దినార్లు, శ్రీలంక 500 రూపాయల నోటు వచ్చినట్లు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

రాజంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 617వ జయంతి వేడుకల సందర్భంగా మంగళవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకలో ఇటు అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఎండీ సర్వేశ్వరి, పి.సుబ్రమణ్యం బృందంచే నిర్వహించిన సంగీత విభావరి విశేషంగా ఆకట్టుకుంది. ఎం.పూర్ణ బృందం నిర్వహించిన హరికథ కళాకారులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు, భజనలను అలరింపజేశాయి. ముఖ్యంగా తాళ్లపాక ధ్యానమందిరంలో అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమాలను వీక్షించేందుకు రాజంపేట చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు హాజరై భక్తిశ్రద్ధలతో తిలకించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

బి.కొత్తకోట, మే13(ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం కొనసాగుతోంది. మండలంలోని, తుమ్మనంగుట్ట, గోళ్లపల్లి పంచాయతీల పరిధిలో మూడు చోట్ల చోరీలకు పాల్పడిన దొంగలు మంగళవారం పట్టణ శివారులోని సబ్‌స్టేషన్ సమీపంలో వున్న రైతు వెంకట్రమణకు చెందిన హెచ్‌వీడీయస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని రాగివైరు, ఆయిల్‌లను ఎత్తుకెళ్లారు. బి.కొత్తకోట పోలీసులు దీనిపై దృష్టి సారించి ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలు అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మృతురాలి చేతిపై పేరు గుర్తింపు

రామసముద్రం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎలకపల్లె సమీపంలో ఆదివారం రాత్రి పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన సంఘటనలో మృతి చెందిన మహిళ కుడి చేతిపై యస్మిత పేరు ఉన్నట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు మృతురాలి కుడిచేతిపై యస్మిత అనే పేరుతో ట్యాటు ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

నలుగురు అరెస్టు

చెన్నూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచిన్నాయపల్లెకు సమీపంలోని వ్యవసాయ పొలాల్లో కోడిపందెం ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు పందెం కోళ్లతో పాటు రూ.4400 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు.

343 గ్రాముల బంగారు చోరీ

● మేనకోడలి వివాహంలో గుర్తుతెలియని వ్యక్తులు అపహరణ ● ఏఎస్పీకి ఫిర్యాదు



అనుమానితులపై ఏఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాధిత మహిళ

రాజంపేటటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): మేనకోడలి వివాహానికి సోదరుడి ఇంటికి వచ్చిన చెల్లెలు బ్యాగులోని బంగారు మాయమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 343 గ్రాముల బంగారాన్ని పోగొట్టుకుని ఖంగుతిన్న చెల్లెలు చేసేదేమి లేక స్థానిక ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డేకు మంగళవారం ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని కోరారు. బాధితురాలు సానంరెడ్డి నాగమణి కథనం మేరకు..

పట్టణంలోని విద్యుత్ నగర్‌లో నివాసం ఉంటున్న తన అన్న కుమార్తె సాయినందిని వివాహానికి ఏప్రిల్ 28న తిరుపతి నుంచి తాను రాజంపేటకు వచ్చానని, ఆ సమయంలో వెంట తీసుకొచ్చిన బంగారం వధువు స్వగృహంలో బెడ్‌రూంలో భద్రపరిచానన్నారు. అనంతరం వరండాలో నిర్వహిస్తున్న మెహంది కార్యక్రమంలో పాల్గొని తిరిగి రాత్రి 10.30 గంటల సమయంలో తన గదికి వచ్చామన్నారు. ఆ రాత్రి గదిలో అన్న జోగి సుదర్శన్‌రెడ్డి, వదిన జోగి చంగమ్మ, తన కుమార్తె వర్షిణి, పెళ్లికుమార్తె సాయినందిని, అత్త పోలి సరోజనమ్మతో కలిసి తాను నిద్రించానన్నారు. మరుసటిరోజు ఉదయం ఆరు గంటలకు నిద్రలేచి పెళ్లి పనుల్లో నిమగ్నమయ్యామన్నారు. కాగా 10 గంటల సమయంలో స్నానానికి వెళ్లేందుకు బ్యాగు ఓపెన్ చేయగా అందులో చిందరవందరగా దుస్తులు ఉండడం చూసి షాక్‌కు గురయ్యామని, ఓపెన్ చేసి చూడగా బంగారం కనిపించలేదన్నారు. ఈ విషయంపై సీసీ పుటేజీని పరిశీలించినా గుర్తించలేకపోవడంతో అదే రోజు అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. తాము 19 మంది మీద అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశామని, చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించి బంగారం తమకు అందేలా చర్యలు చేపట్టాలని బాధిత మహిళ ఏఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

● అవయవాలు దానం చేసిన కుటుంబసభ్యులు



మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు, కుటుంబ సభ్యులు, కొండారెడ్డి (ఫైల్)

చిన్నమండెం, మే 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మద్దిరాల కొండారెడ్డి (21) తాను చనిపోతూ మరో 8 మందికి అవయవ దానం చేశారని కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలిలా.... చిన్నమండెం మండలం చాకిబండ గ్రామం అంపాబత్తునివారిపల్లెకు చెందిన మద్దిరాల కొండారెడ్డి బెంగుళూరులో సివిల్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 8వ తేది రాత్రి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే స్థానికుల సమాచారం మేరకు పోలీసులు తీవ్రంగా గాయపడిన కొండారెడ్డిని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. వైద్యుల వైద్య సేవల అనంతరం సోమవారం రాత్రి మృతి చెందినట్లు నిర్ధారించారు. వైద్యుల సూచనల మేరకు కొండారెడ్డి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అవయవాలు దానం చేసి మరికొందరి ప్రాణాలను నిలబెట్టే దిశగా ఆలోచించారు. కొండారెడ్డికి సంబంధించిన గుండె, లివర్, కిడ్నీలు తదితర అవయవాలు దానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

ఇదిలా ఉండగా కుమారుడి చదువు కోసం తల్లిదండ్రులు కంచెంరెడ్డి, కోటేశ్వరమ్మలు ఎన్నో ఏళ్లుగా కష్టపడి వ్యవసాయ పనులు, కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకున్నారు. ఆ డబ్బులతోనే పిల్లలను చదివించుకున్నారు. కుమారుడు కొండారెడ్డి సివిల్ ఇంజనీర్‌గా ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడని సంతోషం వ్యక్తం చేశారు. అయితే అది చాలా రోజులు నిలబడలేదు. విధి ఆడిన వింత నాటకంలో ఆ కుటుంబం ఉన్న ఒక్క కుమారుడిని పోగొట్టుకున్నారు. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో పాటు చాకిబండ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

ఇంటింటా చెట్టు... ఊరూరా వనం లక్ష్యం


నర్సరీల్లో పంపిణీకి సిద్ధమవుతున్న మొక్కలు

● మొక్కల పెంపకానికి సిద్ధమవుతున్న అటవీశాఖ ● జూన్ నాటికి 20 లక్షల మొక్కలు అందుబాటులోకి..
● పండ్లు, అటవీజాతి, ఎర్ర చందనం మొక్కలు ● సామాజిక వన విభాగం ఆధ్వర్యంలో ఎనిమిది నర్సరీలు


యురేనియం ప్రాజెక్టులో నాటిన మొక్కలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : మానవాళి మనుగడకు, కాలుష్య నియంత్రణతో పాటు వర్షాలు సమృద్ధిగా కురవడానికి పచ్చని చెట్లు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటాయి. ఇందుకోసం అడవుల పరిరక్షణతో పాటు ఇంటింటా చెట్టు, ఊరూరా వనం అనే నినాదంతో మొక్క ల పెంపకానికి అటవీ శాఖ చర్యలు చేపడుతోంది. ప్రతి ఏడాది వర్షాకాలంలో ప్రజల ద్వారా మొక్కలను నాటిం చేందుకు ప్రోత్సహిస్తుంది. ఇందులో భాగంగా సామాజిక అటవీ విభాగం ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలను పెంచి ప్రజలకు పంపిణీ చేయడం జరుగుతుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు 20 లక్షల మొక్కలను సామాజిక అటవీ విభాగం పంపిణీకి సిద్ధం చేస్తోంది. ఇందులో పండ్లజాతి మొక్కల్లో జామ, సీతాఫలం, ఉసిరి మొక్కలతో పాటు చింత, కరివేపాకు, కానుగ, మారేడు మొక్కలను పెంచుతున్నారు. అంతేకాకుండా పలు రకాల అటవీ మొక్కలను పెంచి పరిశ్రమల ఆవరణలో, రహదారుల వెంబడి నాటేందుకు సిద్ధం చేస్తున్నారు.

పులివెందుల నియోజకవర్గంలోని యురేనియం ప్రాజెక్టు వద్ద ఇప్పటికే 59 హెక్టార్లలో 1,32,000 మొక్కలను నాటినట్లు అధికారిక యంత్రాంగం పేర్కొంటుంది. ఈ సంవత్సరం మరో వంద హెక్టార్లలో మొక్కలను నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అదే విధంగా రహదారులకు ఇరువైపులా మొక్కలను నాటి వాటిని పరిరక్షించే చర్యలు కూడా చేపడుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పది కిలోమీటర్ల మేర మొక్కలు నాటాలనేది లక్ష్యంగా పెట్టుకున్నట్లు సామాజిక అటవీ విభాగం అధికార యంత్రాంగం చెబుతుంది.

వివిధ నిధుల ద్వారా...

మొక్కల పెంపకానికి వివిధ నిధుల ద్వారా అటవీశాఖ ఖర్చు చేస్తుంది. ఇందులో భాగంగా కంపా గ్రాంట్ కింద లక్ష 60వేల మొక్కలు పెంచి పోషిస్తున్నారు. ఇందులో పండ్ల జాతి కొయ్య జాతి మొక్కలున్నాయి. అదే విధంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 17 లక్షల మొక్కలను తయారు చేస్తున్నారు. ఇందులో పండ్ల జాతికి సంబంధించి సీతాఫలం, జామ, గోరింట, కరివేపాకు, నిమ్మ, వేప, కానుగ, మారేడు, ఉసిరి, చింత మొక్కలతో పాటు అటవీ జాతి మొక్కలు ఉన్నాయి. ఎంటీఏటీఎస్ నిధుల ద్వారా సుమారు లక్ష ఎర్రచందనం మొక్కలను తయారు చేస్తున్నారు. ఎర్రచందనం చెట్ల నుంచి విత్తనాలు సేకరించి మొలకెత్తిస్తున్నారు. ఈ మొక్కలను రైతులకు, ప్రభుత్వ కార్యాలయాలు ఆవరణలో నాటేందుకు పూర్తి ఉచితంగా పంపిణీ చేస్తారు. అయితే మొక్కలు అవసర మైన రైతులు తమ వ్యవసాయ భూమికి సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకం నఖలు, ఆధార్‌లను సమర్పించాల్సి ఉంటుంది. అదే విధంగా ప్రైవేటు సంస్థకు ప్రైవేటు వ్యక్తులకు కలెక్టరు ఆధ్వర్యంలో ఏర్పాటు అయ్యే కమిటీ సూచించిన ధరల మేరకు మొక్కలను అందజేయడం జరుగుతుంది.



ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

పచ్చదనం ప్రగతికి మెట్లు అనే విధంగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా మొక్కల పెంపకానికి ముందుకు రావాలి.తమకు నచ్చిన మొక్కలు తీసుకుని వాటిని నాటడంతో పాటు ఎంతో బాధ్యతగా సంరక్షించాల్సిన అవసరం ఉంది. ప్రజలకు అవసరమైన మొక్కలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- ఎం.శివకుమార్, డీఎఫ్‌వో, సామాజిక వన విభాగం


రోడ్డు పక్కన నాటిన మొక్కలు

8 చోట్ల నర్సరీలు ఏర్పాటు

సామాజిక వన విభాగం పరిధిలో జిల్లాలో ఎనిమిది చోట్ల నర్సరీలు నిర్వహిస్తున్నారు. కడప నగర పరి ధిలో బుగ్గ డ్యామ్ వద్ద, సీకేదిన్నె మండలంలోని మద్దిమ డుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, కొండాపు రు, జమ్మలమడుగు, వేంపల్లెలో నర్సరీలు నిర్వహిస్తున్నా రు. ఇవి కాకుండా అటవీశాఖ కూడా జిల్లాలోని పలు ప్రాంతాల్లో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలను తయారు చేస్తుంది. నర్సరీల నిర్వహణకు అవసరమైన నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో వాటి నిర్వహణ కోసం అధికారులు సిబ్బంది సొంత డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉన్నట్లు తెలుస్తుంది. సామాజిక వన విభాగం పరిధిలోనే దాదాపు 50లక్షల రూపాయలు బిల్లులు ఇప్ప టికీ పెండింగులో ఉన్నట్లు సమాచారం. అయినప్పటికీ అటవీశాఖ సామాజిక వన విభాగానికి సుమారు 20 లక్షల రూపాయలు మేర నిధులు కేటాయించడం వల్ల వారికి కొంత మేర ఉపశమనం కలిగినట్లు తెలుస్తుంది.

'బీజేపీ తిరంగా యాత్ర హాస్యాస్పదం'

వేంపల్లె, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయినందుకు మోదీ ప్రతిభను చాటిచెప్పేందుకు తిరంగా యాత్రను మే 13 నుంచి 23 వరకు నిర్వహించాలని బీజేపీ నిర్ణయించడం హాస్యాస్పమని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. బీజేపీ నాయకులు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పహల్గాం వద్ద భద్రత సిబ్బంది ఉంటే అమాయకులు చనిపోయేవారు కాదన్నారు. పహల్గాంలో పాల్గొన్న ఉగ్రవాదులను ఎంతమందిని పట్టుకున్నారో, ఎంత మం దిని మట్టుబెట్టారో కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

నేత్రదానం... ఇద్దరి అంధులకు వెలుగు


మౌనిక
కార్నియాలను అందిస్తున్న తలిదండ్రులు

వీరపునాయునిపల్లె, మే 13 (ఆంధ్రజ్యోతి): గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన నేసే మౌనిక (18) నేత్రదానంతో మరో ఇద్దరి అంధులకు వెలుగులు పంచనుందని స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు అన్నారు. మండలంలోని పాయసంపల్లెకు చెందన లక్ష్మీదేవి, సురేష్‌ల కుమార్తె మౌనిక మంగళవారం మరణించారు. తమ కుమార్తె మరణించిన పుట్టెడు దుఃఖంలోను నేత్రదానం చేసేందుకు ముందుకు వచ్చిన తల్లిదండ్రులను గ్రామస్థులు అభినందించారు.

కనుల పండువలా కల్యాణోత్సవం


భక్తులకు తాళిని చూపుతున్న పూజారులు, హాజరైన భక్తులు

పెండ్లిమర్రి, మే 13 (ఆంధ్రజ్యోతి): వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వెయ్యినూతులకోన ఆలయంలో గజవాహనవాహన సేవలో లక్ష్మీనృసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం భక్తుల సమక్షంలో పూజారులు లక్ష్మీ నృసింహస్వామి కల్యాణాన్ని కనుల పండువలా నిర్వహించారు. మధ్యాహ్నం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణం కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని వేదపారాయణంలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పిన్నపాటి హరిప్రసాద్ పర్యవేక్షించారు.

సింహ వాహనంపై నారాపురం వేంకటేశ్వరస్వామి



జమ్మలమడుగు, మే 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నారాపురం వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారు సింహవాహనంపై ఊరేగి భక్తులకు కనువిందు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత నారాపురం వేంకటేశ్వర స్వామి ముత్యపు పందిరి వాహనంలో పూజలు అందుకున్నారు. అనంతరం స్నపన తిరుమంజనం కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం ఊంజల్ సేవ, అన్నమాచార్య కీర్తనలు, అనంతరం సింహ వాహనంపై ఊరేగారు. రాత్రి హరికథ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

గజవాహనంపై...చెన్నకేశవుడు



రాజుపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వెల్లాల బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి గజావాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి వాహనసేవను ఆలయ మాడవీధుల్లో ఊరేగింపు చేశారు. జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనరు మల్లి కార్జున ప్రసాద్ వెల్లాలను సందర్శించారు. . బుధవారం జరిగే స్వామి వారి రథోత్సవ వివరాల గురించి బ్రహ్మోత్సవాల కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు జీఎల్ నారాయణరెడ్డి పాల్గొన్నారు. ప్రొద్దుటూరు సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ వెంకటరమణ బ్రహ్మోత్సత కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మహిళ ఆత్మహత్య

జమ్మలమడుగు, మే 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు గ్రామంలో తలారి అంజనమ్మ (43) అనే మహిళ సోమవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... గత కొద్ది రోజులుగా అంజనమ్మ కడుపునొప్పితో బాధపడుతుండేది. కడుపు నొప్పి తగ్గకపోవడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలోకి తరలించగా అప్పటికే మృతి చెందింది. మంగళవారం ఉదయం జమ్మలమడుగు అర్బన్ పోలీసులు సీఐ లింగప్ప, ఎస్ఐ రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలికి భర్త శంకర్, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

బాలిక ఆత్మహత్య



కడప క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి): కడప నగ రం వైఎస్ఆర్ కాలనీలో షేక్ సల్మా (14) అనే బాలిక సోమవారం రాత్రి ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చిన్నచౌకు ఎస్ఐ రవికు మార్ వివరాల మేరకు.. వైఎస్ఆర్ కాలనీకి చెందిన సల్మా తండ్రి గత ఏడాది చనిపోవడంతో బాలిక ఇంటి వద్దనే ఉంటోంది. సెల్‌ఫోనులో ఇన్‌స్టాగ్రామ్ ఎక్కువ చూస్తుండ డంతో బాలిక తల్లి మందలించింది. దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఎవరూ లేనప్పుడు ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మ హత్యకు పాల్పడింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేపినట్లు తెలిపారు.

ఆర్టీపీపీకి భూములు కోల్పోయిన వారికి న్యాయం చేయాలి

● ఎమ్మెల్యే ఆది, భూపేశ్‌రెడ్డి


ఏపీ జెన్‌కో ఎండీకి వినతి పత్రాన్ని ఇస్తున్న ఎమ్మెల్యే ఆది, భూపేశ్‌రెడ్డి

ఎర్రగుంట్ల, మే 13(ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీలోని 600ప్లాంటు నిర్మాణానికి భూములు కోల్పోయిన వారికి వెంటనే న్యాయం చేయాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ జమ్మలమడుగు ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డిలు మంగళవారం విజయవాడలో ఏపీ జెన్‌కో ఎండీ చక్రధర్‌బాబుకు వినతిపత్రాన్ని ఇచ్చారు. ప్లాంటుకు భూములిచ్చి చాలా కాలం అయినప్పటికి ఇప్పటి వరకు వారికి న్యాయం జరగలేదని తెలిపారు. 600 మెగావాట్లకు సంబంధించి సుమారు 600 ఎకరాలకు వరకు భూమిని తీసుకున్నారు. అయితే 1 నుంచి 4వ రీచ్ వరకు ఇప్పటికే మెయింటెనెన్స్‌లో 120 మందికి, పర్మనెంట్ కింద 100 మంది కి ఉద్యోగాలిచ్చారు. 5, 6 రీచ్‌లలో 150 ఎకరాలకు సంబంధించి 140 మంది రైతులు ఉన్నారన్నారు. ఈవిషయంపై ఎండీ స్పందిస్తూ త్వరలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కలమల్ల బాబు, సున్నపురాళ్ల మణినాథ్‌రెడ్డి, భూచుపల్లె రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

'వేతనాలు పెంచకపోతే ఉద్యమిస్తాం'


ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్‌కు నిరసన తెలుపుతామని వినతిపత్రం ఇస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలు

వేంపల్లె, మే 13 (ఆంధ్రజ్యోతి): పనికితగ్గ వేతనం ఇవ్వకపోతే ఆర్జీయూకేటీ నూతన అడ్మిషన్ల సమయంలో ధర్నా చేస్తామని గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటించారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో గెస్ట్‌ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ ఆధ్వర్యంలో ఇడు పులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్‌కుమారస్వామి గుప్తకు మంగళవారం వినతపత్రం ఇచ్చారు. 2018లో జాయిన్ అయిన గెస్ట్ ఫ్యాకల్టీకి ఇప్పటి వరకు పనికితగ్గ వేతనం ఇవ్వలేదని తెలిపారు. ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీకి 110జీఓ అమలు చేసి రూ.40వేలు వేతనం ఇవ్వాలని ఎన్నిసార్లు అడిగినా అధికారులు పట్టించుకోలేదన్నారు. సమస్య పరిష్కారం కోసం ఆర్జీయూకేటీ నూతన అడ్మిషన్ కోసం జూన్ 11, 12, 13 తేదీలలో అడ్మిషన్ ప్రక్రియ నిర్వహించనుందని.. ఆ సమయంలో నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో పనిచేస్తున్న గెస్ట్‌ఫ్యాకల్టీతో ధర్నా చేస్తామని స్పష్టం చేశారు.

'స్టెమీతో గుండెకు భరోసా'

చెన్నూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా రూ.45వేలు విలువ చేసే గుండెకు సంబంధించిన ఇంజక్షన్ అందిస్తుందని చెన్నూరు సీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ సాగర్‌కుమార్‌లు తెలిపారు. స్థానిక సీహెచ్‌సీలో మంగళవారం ఏఎన్‌ఎంల, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ గతంలో అనుకోకుండా చాతి నొప్పి వస్తే సకాలంలో సరైన వైద్యం అందుబాటులో లేక ఇబ్బంది పడేవారని, ఇప్పుడు సీహెచ్‌సీలో రూ.45వేలు విలువ చేసే గుండెకు సంబంధించిన స్టెమీ ఇంజక్షన్ అందుబాటులో ఉందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు గుండె జబ్బు లక్షణాలు వచ్చిన వెంటనే గంటలోపు ప్రభుత్వ ఆసుపత్రికి తీసకువస్తే వైద్య పరీక్షలు చేసి స్టెమీ (టెనెక్టి ప్లస్) ఇంజక్షన్ ఉచితంగా ఇస్తారని ఆయన తెలిపారు.

గుండెపోటుతో గుర్తు తెలియని ప్రయాణికుడు మృతి



సీకేదిన్నె, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న గుర్తు తెలియని ప్రయాణికుడు మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. కడప నుంచి రాయచోటికి వెళుతున్న బస్సు మూలవంక వద్దకు రాగానే ఓ ప్రయాణికుడికి అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. గుర్తించిన తోటి ప్రయాణికులు డ్రైవర్, కండక్టర్‌కు సమాచారం అందించడంతో బస్సును ఆపి 108కు సమాచారం ఇచ్చి రిమ్స్‌కు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

కేకే కొట్టాల గ్రామాన్ని యూసీఐఎల్ తీసుకోవాలి


కలెక్టర్‌ను కలిసేందుకు ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న కేకే కొట్టాల ప్రజలు


వేముల, మే 13 (ఆంధ్రజ్యోతి): యూసీఐఎల్ టైలింగ్ పాండ్ వల్ల నష్టపోయిన కేకే కొట్టాల గ్రామాన్ని యూసీఐఎల్ యాజమాన్యం తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కడప ఎంపీ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కేకే కొట్టాల గ్రామ ప్రజలు కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా టైలింగ్‌పాండ్ వల్ల నష్టపోయామని, గ్రామాన్ని యూసీఐఎల్ యాజమాన్యం తీసుకొని పునరావాసం, పర్మినెంట్ ఉద్యోగ అవకాశం, నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. అప్పటి వరకు టైలింగ్‌పాండ్ నిర్మాణ పనులు పూర్తిగా నిలలిపివేయాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరలో గ్రామాన్ని టైలింగ్ పాండ్‌ను పరిశీలించి న్యాయం చేస్తానని చెప్పినట్లు ప్రజలు తెలిపారు. ఈకార్యక్రమంలో లావనూరు అంకిరెడ్డి, కె.కె.కొట్టాల గ్రామ సర్పంచు రంగనాథం, సింగంశెట్టి మోహన్‌బాబు, శ్రీనివాసులు, రాజశేఖర్, గంగాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంక్‌లోకి.. లేడీ దొంగలు

మహిళ సంచిలోని పొదుపు డబ్బులతో ఉడాయించిన వైనం

ప్రొద్దుటూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం గాంధీరోడ్డులోని ఇండియన్ బ్యాంకులో మహిళ వద్ద ఉన్న సంచిని బ్లేడుతో కోసి డబ్బులు కాజేసి ఇద్దరు కిలాడీ మహిళా దొంగలు ఉడాయించిన సంఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. త్రీటౌన్ సీఐ గోవింద రెడ్డి వివరాల మేరకు...

పట్టణంలోని హనుమాన్ నగర్‌కు చెందని శ్రీమహాలక్ష్మీ డ్వాక్రా మహిళా సంఘానికి చెందిన బొందెల సంజీ వమ్మ అనే మహిళ గ్రూపు పొదుపు డబ్బులు రూ.59,800 ఖాతాలో జమ చేయడానికి ఇండియన్ బ్యాం కుకు వచ్చింది. నోట్లు రాసుకోవడానికి డబ్బులు సంచి లోంచి బయటకు తీసి లెక్కబెట్టుకుంది. కట్టలు కట్టి మళ్లీ కట్టెల సంచిలో వేసుకుంది. గ్రూప్‌లోని మరో సభ్యురాలి అప్పు తీర్మానం జిరాక్స్ తీసుకురమ్మని తన సోదరుడిని పంపడానికి పని పురమాయించింది. డబ్బు ఉన్న సంచి చంకలో పెట్టు కొని వుండటాన్ని గమనించిన ఇద్దరు కిలాడిలేడీలు సంజీవమ్మ వెనక్కి ఆనుకోని వెళ్లి బ్లేడుతో సంచిని కోసి డబ్బుల కట్టను కాజేసి వెంటనే బ్యాంకు నుంచి ఉడాయించారు. సంచిలోని డబ్బులు పోయిన విషయం గ్రహించిన సంజీవమ్మ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీ సులు బ్యాంకులో సీసీ కెమెరాలు పరిశీలించి ఇద్దరు మహిళలు ఈ దొంగ తనం చేసినట్లు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ గోవిందరెడ్డి తెలిపారు. ఈ కిలాడీ లేడీ దొంగ లను పట్టుకోవడానికి ప్రత్యేక పోలీసు టీంలను వేసి గాలిస్తున్నామని తెలిపారు.



బోర్ పాయింట్ చూడబడును
జై గురుదత్త, కె.వి.రమణ, M.Sc., (Geologist) భూగర్భజల పరిశోధన, బోర్ పాయింట్ చూడబడును. సెల్ నెంబర్ : 63023 28007
Ajc-233881

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిజైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 237544

WANTED LECTURER
ఒకేషనల్ జూనియర్ కాలేజీ కడప టౌన్ నందు వర్క్ చేయుటకు అనుభవం కలిగిన వారు కావలెను. Computer Lecturer : Qualification : B.Tech.(C.S.E.), M.C.A., English Lecturer : Qualification : M.A. English (Female), Nursing : Qualification : B.Sc. Nursing (Female), Cont.: 62815 10785, 63004 32822
Ajc-233405

పాసుపోర్టు పోయినది
మేడిశెట్టి ప్రసాద్ తండ్రి మేడిశెట్టి రామసుబ్బయ్య D.No. 6/9, దేవరగట్టుపల్లి, నెర్సుపల్లి, చక్రాయపేట మండలం, YSRజిల్లా, ఆంధ్రప్రదేశ్ పాసుపోర్టు నెం. B7580841, 05/05/2025వ తేది జిరాక్స్ నిమిత్తం ఇంటి నుండి చక్రాయపేటకు బైకులో వెళ్తుండగా పోయినది. దొరికినవారు అందజేయగలరు.
Ajc-000

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సిబ్బంది కొరత తీరేనా... పథకాలు అందేనా..!!



ఖాళీగా ఉన్న ఏవో కుర్చీ

ఒంటిమిట్ట, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను పొందాలనే ఆశతో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు. కార్యాలయాల్లో సిబ్బంది లేకపోవడంతో ఉసూరు మంటూ వెనుదిరగక తప్పడం లేదు. ఒంటిమిట్ట ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది కొరతతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కార్యాలయంలో ఎంపీడీవో, ఏవో, ఈవోపీఆర్డీ సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్లు ఉంటారు కానీ ఒంటిమిట్ట ఎంపీడీవో కార్యాలయంలో ఏవో, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్ల సీట్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇక్కడ పనిచేసిన ఏవో, సీనియర్ అసిస్టెంట్ ఈ యేడాది ఫిబ్రవరి నెలలో సస్పెండ్ అయ్యారు. జూనియర్ అసిస్టెంట్ సెలవుపై వెళ్లారు. అటెండరు గత సంవత్సరం నుంచి కార్యాలయానికి రావడంలేదు. దీంతో ప్రజలకు తిప్పలు తప్పడంలేదు. ప్రస్తుతం అంతటా వివిధ కార్పొరేషన్ల రుణాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇక్కడ మాత్రం సిబ్బంది కొరతతో పనులు జరగడం లేదు. అలాగే పలు పనులకు సంబంధించిన బిల్లులు కూడా చేయాల్సి ఉంది. సిబ్బంది కొరత కారణంగా ఈ పనులన్నీ నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీగా ఉన్న సిబ్బందిని భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.



సీనియర్ అసిస్టెంట్ లేని కుర్చీ

చిరు ధాన్యాల సాగుపై అవగాహన

సిద్దవటం, మే 13 (ఆంధ్రజ్యోతి): చిరు దాన్యాల సాగుపై సిద్దవటం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో కొర్రలు, జొన్న, సజ్జ, రాగి వంటి చిరు ధాన్యా సాగు నిర్వహణ పద్ధతులు, లాభదాయక ధరలు కోసం విలువ జోడింపు గురించి తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజు మాట్లాడుతూ చిరు ధాన్యాల పంటలు సాగు చేయడం రైతుకు లాభదాయకమన్నారు.

తమిళనాడులో ఎమ్మెల్యే శ్రీధర్ పూజలు

రైల్వేకోడూరు, మే 13(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్‌లో సైనికులకు దేవుని బలం ఉండాలని ఆకాంక్షిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సూచన మేరకు తమిళనాడు రాష్ట్రం మదురై జిల్లాలోని పజముదిరైచోలయ్ (సుబ్రహ్మణ్యంస్వామి) ఆలయంలో మంగళవారం జనసేన పార్టీ ఎమ్మెల్యే, విప్ అరవ శ్రీధర్ ఆధ్వర్యంలో జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, సీనియర్ నాయకులు పగడాల చంద్రశేఖర్, జోగినేని మణి, పగడాల వెంకటేష్, ఆలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటంలో నాకాబందీ

సిద్దవటం, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన సిద్దవటంలో మంగళవారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు మాట్లాడుతూ రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చామని, సైబర్‌క్రైం నియంత్రణపై అవగాహన కల్పించామని తెలిపారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మహమ్మద్ రఫి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెనగలూరు డాక్టర్‌గా శ్రేయ



విధుల్లో చేరిన డాక్టర్ శ్రేయ

పెనగలూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎట్టకేలకు ప్రభుత్వ మహిళా డాక్టర్‌ను నియమించారు. రాజంపేటకు చెందిన శ్రేయ మంగళవారం విధుల్లో చేరినట్లు సీహెచ్‌వో సురేంద్రనాథ్‌రాజు తెలిపారు. ప్రభుత్వం నూతనంగా నిర్వహించిన కౌన్సిలింగ్‌లో ఆమెకు పెనలూరులో పోస్టింగ్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రేయ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తాను కృషి చేస్తానన్నారు.

ఉల్లాసంగా వసంతోత్సవం



పెనగలూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారాయణనెల్లూరు సమీపాన గల కంభం బోటుగుట్టపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వసంతోత్సవం వైభవంగా జరిగింది. ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి ఉత్సవవరులను ట్రాక్టర్‌పై కొలువుదీర్చి నారాయననెల్లూరు పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామ ప్రజలు వసంతోత్సవాన్ని నిర్వహించుకున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

రామాపురం, మే13(ఆంధ్రజ్యోతి): కిశోరి బాలికలు మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాతరెడ్డి, పద్మజ, హుస్సేనమ్మలు అన్నారు. మండలంలోని చిట్లూరు సెక్టారులోని పొత్తుకూరుపల్లెలో సూపర్‌వైజర్ సుజాతరెడ్డి, గువ్వలచెరువు క్లస్టర్‌లోని సుగాలి బిడికీలో పద్మజ, రామాపురం క్లస్టర్ బీసీ కాలనీలో హుస్సేనమ్మల ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై సమ్మర్ క్యాంపుపై బాలికలకు అవగాహన కల్పించారు.

బోయనపల్లె కోళ్లఫారాల స్థలాలపై సర్వే చేసి నివేదిక ఇవ్వండి

● అధికారులను ఆదేశించిన సబ్‌కలెక్టర్ నిధియాదేవి



బోయనపల్లెలో కోళ్లఫారాల స్థలాల రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నిధియాదేవి

రాజంపేట టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బోయనపల్లెలో కొంతమందికి కోళ్లఫారాల కోసం కేటాయించిన స్థలాలపై సర్వే చేసి నివేదికను అందజేయాలని రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోం నిదియాదేవి తహసీల్దారు పీర్‌మున్నీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి, ఆర్‌ఐ శేషంరాజు, సర్వేయర్ భవానీలను ఆదేశించారు. వివాదాస్పదంగా మారిన బోయనపల్లె ఫౌల్ట్రీ కాంపెక్సు స్థలాలపై పీజీఆర్ఎస్‌లో పదే పదే ఫిర్యాదులు రావడంతో సబ్‌కలెక్టర్ స్పందించి మంగళవారం అధికారులతో కలిసి కోళ్లఫారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎంతమందికి కోళ్లఫారాల ఏర్పాటు కోసం స్థలాలు కేటాయించారని, ఆ స్థలాల్లో ప్రస్తుతం నిజమైన లబ్ధిదారులు ఉన్నారా.. లేదా.. అని సర్వే చేసి నివేదికను తమకు అందజేయాలని ఆదేశించారు. ఈ విషయంపై లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసి అవగాహన కల్పించాలన్నారు. కాగా సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దారు పీర్‌మున్నీ, బోయనపల్లె కోళ్లఫారాల స్థలాలు, సర్వే కోసం రెండు బృందాలను నియమించి సర్వే చేయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రాఘవ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జడ్‌హెచ్‌డీసీ భూములను పరిశీలించిన సబ్‌కలెక్టర్

ఓబులవారిపల్లె, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిదిలోని చిన్నఓరంపాడు జడ్‌హెచ్‌డీసీ భూములను సబ్‌కలెక్టర్ వైఖోం నిదియాదేవి పరిశీలించారు. అందుకు సంబంధించిన వివరాలను తహసీల్దారు శ్రీధర్‌రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్, సర్వేయర్ నాగలక్ష్మి అందజేశారు.

గాలివీటమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి మండిపల్లి



పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న మంత్రి

గాలివీడు, మే13(ఆంధ్రజ్యోతి): గాలివీటి గంగమ్మ జాతర మంగళవారం అసోధుని కథతో వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.

కాలభైరవుడి మైల తిరునాళ్లలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మే13(ఆంధ్రజ్యోతి): రాయచోటి మండలం యండపల్లి గ్రామం ముసల్‌రెడ్డిగారిపల్లెకు సమీపంలో భైరవగుట్టపై వెలిసిన శ్రీకాలభైరవస్వామి తిరుణాల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగిన మైల తిరుణాల వేడుకల్లో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముసల్‌రెడ్డిగారిపల్లెకు చెందిన సత్యసాయి డెంటల్ క్లీనిక్ డాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి, డాక్టర్ రెడ్డికీర్తిల ఆహ్వానం మేరకు వారి ఇంటికి వెళ్లి విందు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముగిసిన అంకాలమ్మ తిరునాళ్లు



ఆకట్టుకున్న అమ్మవారి వేషాలు... అలరించిన నరసింహస్వామి అవతారం

రైల్వేకోడూరు, మే 13(ఆంధ్రజ్యోతి): గత ఐదు రోజులుగా రైల్వేకోడూరు పట్టణంలోని అంకాలమ్మ దేవస్థానంలో నిర్వహించిన తిరునాళ్ల మంగళవారంతో ముగిసింది. సోమవారం రాత్రి అమ్మవారి పెద్ద ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. అమ్మవారి వేషాలు ఆకట్టుకున్నాయి. భారీఎత్తున బాణసంచా పేల్చారు. విజయవాడ తప్పెట్లు, మదనపల్లె డ్రమ్స్‌తో స్థానికులు కూడా ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు. మంగళవారం అమ్మవారికి పూలకపిలి చేశారు. సాయంత్రం భక్తులు పొంగళ్లు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో తోట కుటుంబీకులు పాల్గొన్నారు.

ఆరెమ్మ తల్లికి అభిషేకం, పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆరెమ్మ తల్లి

సుండుపల్లె, మే13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలిసిన శ్రీఆరెమ్మ తల్లి తిరుణాల సందర్భంగా మంగళవారం అభిషేకం, పూజలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏడాది ఆరెమ్మ తల్లి తిరుణాల వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులను చల్లంగా చూడు తల్లి అని పూజలు నిర్వహించారు. మండల నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయంతో తిరుణాల ముగుస్తుంది. ఈ కార్యక్రమంలో వైసీపీ నేత యర్రపురెడ్డి అజయ్ కుమార్‌రెడ్డి, ఆరెంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో కోడూరు విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులతో సాయివికాస్‌రెడ్డి

రైల్వేకోడూరు రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): తైక్వాండోలో రైల్వేకోడూరు విద్యార్థులు ప్రతిభ చూపారు. తైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు తిరుపతి లోని ద రాక్ ఫైటర్స్ తైక్వాండో క్లబ్‌లో జరిగింది. ఇందులో కోడూరు విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ నేపథ్యంలో మంగళవారం క్రీడాకారులకు సర్టిఫికెట్లు, బెల్ట్‌ను టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి అందజేశారు. ఎస్‌కే స్పోర్ట్స్ అకాడెమీ నిర్వాహకులు మౌలా, క్రీడాకారులు పాల్గొన్నారు.

కొత్తపురమ్మ సన్నిధిలో పాలఏకరి రాష్ట్ర కన్వీనర్

సంబేపల్లె, మే13(ఆంధ్రజ్యోతి): దుద్యాల గ్రామం కొత్తపురమ్మ ఆలయ సన్నిధిలో మంగళవారం టీడీపీ బీసీ సాధికారిక సమితి పాల ఏకరి రాష్ట్ర కన్వీనర్ గురిగింజకుంట శివప్రసాద్‌నాయుడు (గుట్టబాబు) అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దుద్యాల గ్రామంలో వెలిసిన కొత్తపురమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అభిమాని దుద్యాలకు చెందిన చెన్నూరు నాగేశ్వర ఆహ్వానం మేరకు విందు కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. ఆలయ సభ్యులు పూల మాలతో ఆయనున్న సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోటిరెడ్డి, నాగేందర్‌రెడ్డి, తాతిరెడ్డి, విశ్వనాధరెడ్డి, పూజారి సాంబయ్య, చెన్నూరు నాగేశ్వర పాల్గొన్నారు.

నేడు ఓబిలి గంగమ్మ జాతర

పెనగలూరు, మే 13 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఓబిలి దళితవాడలో ఈనెల 14న గ్రామదేవత గంగమ్మ జాతర జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ గ్రామంలో సుమారు 70 ఏళ్ల కిందట జాతర జరిగినట్లు పూర్వీకులు తెలిపారు. జాతర ముందురోజు గ్రామంలో పోతులరాజు ఊరేగింపు, పురవీధుల్లో బలిపోతు ఊరేగింపు, దేవాలయం సన్నిధిలో ఆసాది కథ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతర రోజు గురువారం గంగమ్మను శాంతింపజేసేందుకు పొట్టేళ్లు, మేక పోతులు, కోడిపుంజులను బలి ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చాలా ఏళ్ల తర్వాత గ్రామంలో జాతర జరుగుతుండడం వల్ల భారీఎత్తున బంధుమిత్రులకు ఆహ్వానాలు పంపి విందుభోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సందర్భంగా గ్రామస్థులు తెలిపారు.

ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రోత్సాహం



క్రీడాకారులతో సురేంద్రారెడ్డి

వీరబల్లి, మే13(ఆంధ్రజ్యోతి): ప్రతిభ చూపే జూనియర్ క్రికెట్ క్రీడాకారులనుప్రోత్సహించేందుకువారం రోజుల పాటు క్రికెట్ క్రీడాభిమాని వసీమ్ అక్రమ్ శిక్షణతో పాటు ఆటలో మెలుకువలు నేర్పించడం అభినందనీయమని వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి, కుమార్‌స్వామిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వారం రోజులుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో జూనియర్ క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి ప్రోత్సాహం అందించేందుకు సీనియర్ క్రీడాకారుడు వసీమ్ అక్రమ్ ముందుకు వచ్చి ప్రతి క్రీడాకారునికి మెడల్ వేసి అభినందించడం క్రీడాకారులకు పోటీతత్వం ఏర్పడుతుందని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల్లో రాణించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్ అందిస్తున్నదని తెలిపారు. వీరబల్లి మండలంలో మినీ స్టేడియం ఏర్పాటులు చేసేలా రాష్ట్ర క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫైబర్ నెట్ మస్తాన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచకపోతే చర్యలు : కమిషనర్



దుకాణాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

రాజంపేట టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణం, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచకపోతే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో పలు ప్రాంతాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణదారులు చెత్తను బుట్టల్లో నిల్వ ఉంచాలని, వాటిని మున్సిపల్ కార్మికులు సేకరిస్తారన్నారు. చెత్తను రోడ్డుపై వేస్తే జరిమానా తప్పదన్నారు. లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. అలాగే కొత్తబస్టాండు వద్ద ధనుశ్రీ చికెన్ సెంటర్‌లో అపరిశుభ్రతను గమనించి వారిని మందలించారు. ప్రధాన కాలువలపై వేసిన బండలపై షెల్టర్‌లు వేశారని, దీనివల్ల పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వ్యాపారాలను కాలువ అవతలివైపునకు జరపాలని, లేకుంటే వాటిని తొలగిస్తామని హెచ్చరించారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల అందజేత



టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్న పట్టణ మైనార్టీ కార్యదర్శి అతావుల్లా

రాయచోటి టౌన్, మే13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేట, రవిహాల్ తదితర ప్రాంతాల్లో మంజూరైన టీడీపీ సభ్యత్వ కార్డులను సోమవారం రాత్రి మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్.అతావుల్లా స్థానికంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రికార్డు స్థాయి లో సభ్యత్వం నమోదు కావడం జరిగిందని, రాష్ట్రం నుంచి వచ్చిన టీడీపీ సభ్యత్వ కార్డులను రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయడం జరిగిందని పార్టీ సభ్యత్వ నమోదు తీసుకున్న ప్రతి ఒక్కరికీ ఐదు లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. అలాగే సభ్యత్వ కార్డు వల్ల ప్రయోజనాలను వివరించారు. ఐ ఫ్యాషన్ అధినేత ముజాహిద్‌బాషా, కొత్తపల్లి ఏరియా ప్రజలు పాల్గొన్నారు.

'ఉపాధి పనులు కల్పించండి'

గాలివీడు, మే13(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి పనులు కల్పించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీడీవో జవహర్‌బాబుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ఎగువగొట్టివీడు, చీమలచెరువుపల్లి, గోరాన్‌చెరువు తదితర గ్రామాల్లో కూలీలకు పని కల్పించడంలో విఫలమ య్యారన్నారు. అలాగే కూలీలకు భద్రత కల్పించాలని, ఎండల తీవ్రతను బట్టి మచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు కూలీలకు ఉచితంగా ఏర్పాటు చేయాలని కోరారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు మావిళ్ల రఘునాథ్‌నాయుడు, పూసపాటి రమణ తదితరులు పాల్గొన్నారు.

'సమ్మెను జయప్రదం చేయండి'



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘం నేతలు

రాజంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘం, ఉపాధిహామీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఎన్జీవో కార్యాలయంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పందికాళ్ల మణి, ఉపాధి హామీ సంఘం నాయకులు శంకర్, మధు, నారాయణ, హరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని, 200 రోజుల పనిదినాలు కల్పించాలని, రూ.6 వేల వేతనంతో పాటు వేసవి అలవెన్స్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే వేసవి తాపం నుంచి తట్టుకునేందుకు కూలీలకు టెంట్లు ఏర్పాటు చేయాలని, మేట్‌లకు రూ.5 పారితోషకం ఇవ్వాలన్నారు. ప్రతి కార్మికుడికి రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలని, 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరారు. కార్మిక హక్కుల సాధనకు అన్నిరంగాల కార్మికులు ఏకమై ఈనెల 20న సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

భూ సమస్యలకు రీసర్వేతో చెక్



తహసీల్దారుకు భూమి డాక్యుమెంట్లు అందిస్తున్న రైతు

రైల్వేకోడూరు రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి రీసర్వే మార్గమని రైల్వే కోడూరు తహసీల్దార్ మహబుబ్‌చాంద్ తెలిపారు. మంగళవారం మండలం లోని ఓబనపల్లి గ్రామంలో రీసర్వేకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూమి రీసర్వే కార్యక్రమంలో భాగంగా మండలంలోని బుడుగుంటపల్లి, రాఘవరాజు పురం గ్రామాలలో రీసర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. రీసర్వే సమయంలో అధికారులు వచ్చినప్పుడు రైతులు తమ పాసు పుస్తకాలు, భూమికి సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులకు అందజేయాలని కోరారు. సమస్యలు ఉంటే అక్కడే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సర్వేయర్ బాలసుబ్రహ్మణ్యం మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం



గెలుపొందిన జట్టుకు కప్పు అందజేస్తున్న చైర్మన్ గంగిరెడ్డి

సుండుపల్లె, మే13(ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు సమాజంలో గుర్తింపు లభిస్తుందని మానవతా మండల కన్వీనర్ మిన్నమరెడ్డి గంగిరెడ్డి తెలిపారు. మంగళవారం మిన్నమరెడ్డి శివారెడ్డి జ్ఞాపకార్థం జరుగుతున్న టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గెలుపొందిన గబ్బర్‌సింగ్ (వడ్డిపల్లి) జట్టుకు కప్పుతో పాటు రూ.40 వేలు, రన్నర్స్ జట్టు సూపర్ కింగ్స్ జట్టుకు రూ.20 వేలు నగదు, కప్పును అందజేశారు. మొదట టాస్ గెలిచిన సూపర్‌కింగ్స్ జట్టు 16.5 ఓవర్లకు 134 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యారు. అనంతరం బ్యాటింగ్ చేసిన గబ్బర్‌సింగ్ (వడ్డిపల్లి) జట్టు 8 వికెట్లు కోల్పోయి 19.3 బంతుల్లో 135 పరుగులు చేసి గెలుపొందారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా శేషాద్రినాయుడు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా అశోక్ ఉత్తమ ప్రతిభను కనపరిచారు. ఉపాధ్యాయులు హరికుమార్, రెడ్డెయ్యరాజు, ఒంటేరు రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద స్థలాల గుర్తింపు

చిన్నమండెం, మే13(ఆంధ్రజ్యోతి): తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను ఎస్‌హెచ్ జేఈ గిరీష మంగళవారం పరిశీలించారు. కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై వండాడి క్రాస్ వద్ద ఇటీవల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని టీడీపీ నేత వెంకట్రామిరెడ్డి ఎస్‌హెచ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు పరిశీలించారు.



వైభవంగా ముగిసిన నల్లగంగమ్మ జాతర



ప్రత్యేక అలంకణలో అమ్మవారు

అబ్బురపరుస్తున్న చాందినీబండి

సంబేపల్లె, మే13(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె దేవరరాయి నల్లగంమ్మ జాతర సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మంగళవారం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులను తీర్చుకోవడంతో జాతర ముగిసింది. సోమవారం రాత్రి ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిపోయింది. భక్తుల కాలక్షేపం కొరకు ఆర్కెస్ట్రా కార్యక్రమం నిర్వహించారు. దాతలు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తుల కోలాహాల మధ్య జాతర అట్టహాసంగా ముగిసింది.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
రాజంపేట - A.C.O.: 99854 11312 | రాయచోటి - A.C.O.: 63006 38887 | రాయచోటి - S.R.: 99858 65573 | రైల్వేకోడూరు - S.R.: 98854 12462 | D.C.M.: 99854 11184

జాతరకు వెళ్లి వచ్చేలోపు చోరీ


చోరీకి గురైన బీరువా

పీలేరు, మే 13(ఆంధ్రజ్యోతి): తెల్లవారుజామున 4 గంటలకు జాతరకు వెళ్లి వచ్చేలోపు ఓ ఇంటిలో చోరీ జరిగిన సంఘటన మంగళవారం పీలేరులో జరిగింది. పీలేరు మండలం వేపుల బైలు గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డి పీలేరులోని చెన్నారెడ్డి కాలనీలో కాపురముంటున్నారు. వేపుల బైలులో సోమవారం రాత్రి, మంగళ వారం ఉదయం జాతర ఉండడంతో అతను తన కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం ఉదయం 4 గంటలకు ఇంటి నుంచి వేపులబైలుకు వెళ్లాడు. జాతరలో అమ్మవారి దర్శనం చేసుకుని 6 గంటలకు ఇంటికి తిరిగి రాగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడం గమనించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి, అందులోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. బీరువాలోని 100 గ్రాముల బంగారు ఆభరణాలు, వ్యాపారం కోసం సరిచేసుకున్న రూ.5 లక్షల నగదు అపహరణకు గురైనట్లు అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీనివాసులరెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాలకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా కేంద్రం నుంచి వేలి ముద్ర నిపుణులను పిలిపించి సంఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరించారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


సిద్దారెడ్డి (ఫైల్ ఫొటో)

తంబళ్లపల్లె, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నెమడుగు వద్ద శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో గాయ పడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. వివరాల మేరకు... తంబళ్లపల్లె మండలం మర్రి మాకులపల్లె పంచాయతీ గొల్లపల్లెవారిపల్లెకు చెందిన సిద్దారెడ్డి(43) గత శనివారం సొంత పనుల నిమిత్తం స్వగ్రామం నుంచి కన్నె మడుగుకు ద్విచక్ర వాహనంలో వస్తున్నాడు. ఈ క్రమంలో నాయని చెరువు వద్ద పక్క నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో సిద్దారెడ్డి తలకు గాయమైంది. కుటుంబసభ్యులు బాధితుడిని తొలుత తంబళ్లపల్లె సీహెచ్‌సీకి అక్కడి నుంచి మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు. బాధితుడికి మెరుగైన వైద్య చికిత్సలు అవసరమవ్వడంతో బెంగళూరు తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం పరిస్థితి విషమించడంతో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై దాడులు

● టాస్క్‌ఫోర్స్ అదుపులో ఇద్దరు నిందితులు ?

సిద్దవటం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజంపేట సమీపంలోని ఓ పొలంలో ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచగా సోమవారం రాత్రి కడప టాస్క్‌ఫోర్స్ సిద్దవటం అటవీశాఖ, పోలీసుశాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ దాడుల్లో ఎస్.రాజంపేట గ్రామానికి చెందిన ఇద్దరు నిందితులతో పాటు ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఎస్.రాజంపేట ఎస్సీ కాలనీకి చెందిన ఇద్దరు నిందితులు ఎర్రచందనం దుంగలను విక్రయించేందుకు సమాయత్తం అవుతుండగా టాస్క్‌ఫోర్స్ అధికారులు వారిని ట్రాప్ చేసినట్లు తెలుస్తోంది. ఎస్.రాజంపేట సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి తెచ్చిన ఎర్రచందనం దుంగలను చిన్న చిన్నముక్కలుగా చేసి పొలంలో పూడ్చి ఉంచినట్లు తెలిసింది. వాటిని విక్రయించేందుకు సిద్ధపడడంతో విషయాన్ని తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు ఫోన్‌ద్వారా నిందితులను ట్రాప్ చేసినట్లు సమాచారం. ఈ మేరకు పట్టుబడ్డ నిందితులను తిరుపతికి తరలించి విచారిస్తున్నట్లు తెలిసింది. విచారణలో నిందితులు పలు విషయాలు వెల్లడించినట్లు సమాచారం.

ఆదాయం.. ఆనందం.. ఆరోగ్యం

● 'ఫార్మర్స్ పెన్షన్ ప్లాన్'
● ముప్పావు ఎకరాలో 110 రకాల పండ్ల మొక్కల పెంపకం
● ఏడాది పొడవునా ఆదాయం ఉండేలా రూపకల్పన
● ప్రయోగాత్మకంగా చేపట్టి విజయం సాధించిన పీలేరు రైతు


రైతు రత్నశేఖరరెడ్డి వ్యవసాయ క్షేత్రం

పీలేరు, మే 13 (ఆంధ్రజ్యోతి): పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవించే రైతులకు ఏడాది పొడవునా ఆదాయం ఉండడం చాలా తక్కువ. ఎప్పటికప్పుడు మారిపోయే వాతావరణ పరిస్థితుల కారణంగా అనుకోని ఉపద్రవం ముంచుకొచ్చి రైతుకు నష్టం వాటిల్లుతూనే ఉంటుంది. అలా కాకుండా ఏదో ఒక పంట ద్వారా నిత్యం ఎంతో కొంత ఆదాయం సంపాదించుకోవాలని పి.రత్నశేఖర్‌రెడ్డి అనే రైతు 'ఫార్మర్స్ పెన్షన్ ప్లాన్' అనే వ్యవసాయ విధానాన్ని చేపట్టాడు. పండ్ల మొక్క పెంపకం ద్వారా ఏడాదిలోని ప్రతి సీజన్‌లోనూ ఆదాయం పొందవచ్చని తలంచిన ఆయన అనుకున్నదే తడవుగా తన పొలంలోనే ప్రయోగానికి శ్రీకారం చుట్టాడు. దాదాపు రెండేళ్ల పాటు శ్రమించాడు. అతడి కష్టానికి తగ్గ ఫలితం దక్కింది. ప్రస్తుతం అతను తన పండ్ల తోట ద్వారా ప్రతి నెలా కొంత ఆదాయం పొందుతున్నాడు.

ఆదాయం కోసం అనేక ప్రయోగాలు

పీలేరు మండలం వేపులబైలు పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన పి.రత్నశేఖరరెడ్డి ఓ ప్రగతిశీల రైతు. నూతన ప్రయోగాలు చేయడంలో ఎప్పుడూ ముందుండేవాడు. తనకు తెలిసినంతలో అతను అనేక ప్రయోగాలు చేసి కొన్నిసార్లు విజయం, కొన్నిసార్లు ఓటమి చవి చూసేవాడు. వ్యవసాయంలో కంటే కోళ్లు, గొర్రెల పెంపకంలో అతనికి బాగా కలిసి వచ్చింది. రైతు కుటుంబం నుంచి వచ్చిన వాడు కావడంతో వ్యవసాయంపై మమకారం చావక వరి, వేరుశెనగ, టమోటా, మామిడి సాగు చేసుకునేవాడు. ఆ క్రమంలో అతనికి 2018లో పీలేరుకు చెందిన ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదేషావలితో పరిచయం ఏర్పడింది. దీంతో వారిద్దరూ 2019లో రత్నశేఖరరెడ్డికి చెందిన కేవలం ముప్పావు ఎకరాలో దోస పంటను సాగు చేశారు. పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటను సాగు చేయడం సాధ్యం కాదని, అందునా మార్చి మాసంలో పంట వేయడం తప్పని తోటి రైతులు రత్నశేఖరరెడ్డిని భయాందోళనకు గురిచేశారు. అయినా ఎవరి మాటలను లెక్క చేయకుండా ముందుకెళ్లాడు. పంట కాలానికి కావాల్సిన కషాయాలు, ఎరువులను ముందుగా సిద్ధం చేసుకుని రంగంలోకి దిగడంతో ఎప్పటికప్పుడు వచ్చిన తెగుళ్లను విజయవంతంగా ఎదుర్కొన్నారు. కేవలం 60 రోజుల పంట అయిన దోసలో రూ.2 లక్షల లాభం గడించారు. అప్పటి నుంచి రత్నశేఖరరెడ్డికి ప్రయోగాలపై గురి కుదిరింది. ఆ తరువాత బోదేషావలి పర్యవేక్షణలో పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వరి సాగు చేసి కేవలం ఎకరా పొలంలో 47 బస్తాల వరి పండించాడు. ఆ తరువాత కాలాలు, సీజన్‌లతో పనిలేకుండా రైతుకు ఎల్లప్పుడూ ఆదాయం వచ్చేలా ఏదైనా పంట రూపకల్పన చేసుకుని ప్రయోగాత్మకంగా తానే పండించాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. అలా తనకున్న ముప్పావు ఎకరా పొలంలో పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఎటువంటి రసాయనిక ఎరువులు వినియోగించకుండా 110 రకాల పండ్ల మొక్కలు, కొన్ని వాణిజ్య మొక్కలను సాగు చేస్తున్నాడు. 'ఫార్మర్స్ పెన్షన్ ప్లాన్' అని దానికి నామకరణం చేసి 2022లో మొక్కల పెంపకం ప్రారంభించాడు. ఖమ్మం, కడియం, రైల్వేకోడూరు, బెంగళూరులోని ఐఏహెచ్‌ఆర్, హైదరాబాదు ప్రాంతాల నుంచి వివిధ పండ్ల మొక్కలను తెప్పించుకుని తోటను పూర్తిగా సమకూర్చుకోవడానికి ఏడాది సమయం పట్టింది. ప్రస్తుతం అతని తోటలోని పలు పండ్ల మొక్కలు కాపుకు వచ్చాయి.

మినీ వనాన్ని తలపించేలా..

రైతు తోటలో ప్రస్తుతం అరటి (10 చెట్లు), జామ (50), సపోట (15), టెంకాయ (70), డ్రాగన్ ఫ్రూట్ (100), ఆపిల్ బేర్ (15), బత్తాయి (15), చీనీ (6), నేరేడు (10), అవకాడో (2), సీతాఫలం (10), రామాఫలం (1), లక్ష్మణ ఫలం (1), హనుమ ఫలం (2) పనస (5), తీపి చింత (3), నూర్జహాన్ మామిడి (2), ప్యాషన్ ఫ్రూట్ (2), కలింగర కాయ (2), అంజీర (10), బొప్పాయి (20) వంటి పండ్ల మొక్కలు ఉన్నాయి. తోటకు కంచె పంటగా మునగ (20), శ్రీగంధం (50), మహాగని (50 చెట్లు), అంతర పంటలుగా టమోటా, వంకాయ, మిర్చి, బంతి, చామంతి సాగు చేస్తున్నారు. వర్షాకాలంలో వర్షాధారంగా వేరుశెనగ సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నాడు. సీజన్‌ల వారీగా పంట చేతికొస్తున్నాయి. పల్లెలో విక్రయించుకోగా మిగిలిన వాటిని ప్రతి మంగళవారం పీలేరులో జరిగే వారపు సంతలో విక్రయిస్తున్నాడు.

కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం

కేవలం పండ్లపైనే ఆధారపడకుండా రత్నశేఖరరెడ్డి తన తోటలో నాటు కోళ్లను కూడా పెంచుతున్నాడు. తోటలోనే షెడ్డు నిర్మించి క్రమం తప్పకుండా 100 కోళ్లు పెంచుతున్నాడు. తోటలోని వ్యర్థాలను తిని పెరుగుతున్న ఆ కోళ్లు చాలా ఆరోగ్యంగా, బలవర్థకంగా తయారవుతుండడంతో వాటికి కూడా మంచి ధర పలుకుతోంది. దీంతో రైతు అదనపు ఆదాయం సమకూరుతోంది.

పలువురి సందర్శన

ఈ వ్యవసాయ క్షేత్రాన్ని తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు గడిచిన మూడేళ్లుగా సందర్శిస్తున్నారు. ఆయన తోటలో ఆయన అవలంబిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వ్యవసాయ కళాశాల అధ్యాపకులు తమ విద్యార్థులకు వివరిస్తుంటారు. కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు ఈయన తోటను సందర్శించి అతనికి అనేక సలహాలు, సూచనలు చేస్తున్నారు. అంతేకాకుండా మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న అనేక సంస్థలు తమ రైతులను పలు మార్లు తీసుకువచ్చారు. ఆయన పాటించిన విధానాలను ఆయా రైతులు అవలంబిస్తుంటారు.

పండ్ల తోటతో ఆరోగ్యం, ఆదాయం

● రత్నశేఖరరెడ్డి, రైతు



నికర ఆదాయం లేక పోవడం వల్ల నాలాంటి రైతులు ఎక్కువగా వ్యవసాయాన్ని వదిలేస్తుంటారు. ఇంకో పని చేతకాక వృద్ధాప్యంలో కుటుంబసభ్యుల నుంచి అనేక ఇబ్బందులు పడు తుంటారు. అందుకనే నేను ప్రయోగాత్మకంగా పండ్ల తోటలను చేపట్టాను. పండ్ల తోటలు పెట్టడం కాసింత ఇబ్బంది, కష్టంతో కూడుకున్న పనే అయినా నిరంతరం ఆదాయం పొందుతూ ఉండవచ్చు. కూలీల టెన్షన్ ఉండదు. పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే రసాయనిక ఎరువుల్లో సగం ఖర్చు మిగిలిపోతుంది.

రైతులకు ఇదొక మంచి అవకాశం

● బోదేషావలి, ప్రకృతి వ్యవసాయ నిపుణుడు



చాలా మంది రైతులకు తమ కుటుంబసభ్యుల నుంచి వ్యవసాయానికి సహకారం ఉండదు. విద్య, ఉపాధి కారణంగా పిల్లలు తమ తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్నారు. పిల్లలు దగ్గర లేకపోవడం వల్ల పెద్దవాళ్లు తమ పొలాలను బీళ్లుగా వదిలేయడమో లేక ఇతరులకు లీజుకు ఇచ్చేయడమో చేస్తుంటారు. అటువంటి వారు మిశ్రమ పండ్ల తోటను పెట్టుకోవచ్చు. కూలీల ఖర్చు కూడా తక్కువ. స్వంతంగా ఒకరిద్దరే తోటను పర్యవేక్షించుకోవచ్చు.


రైతు తోటలో కాసిన వాటర్ ఆపిల్ పండ్లు, తోటను సందర్శించిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు (ఫైల్ ఫొటో), తోటలోని బొప్పాయి చెట్లు, డ్రాగన్ ఫ్రూట్ చెట్లు

వసంతోత్సవంతో శోభిల్లిన కోన

● పెంచలోరికి చక్రతీర్థ స్నానం, తెప్పోత్సవం ● ముగిసిన బ్రహ్మోత్సవాలు, నేడు గోనుపల్లికి శ్రీవారు



దేవేరులతో కలిసి పుష్కరిణిలో విహరిస్తున్న పెంచల నారసింహుడు, చక్రస్నానం జరుపుతున్న అర్చకులు

రాపూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): నరసింహుడికి చక్రతీర్థ స్నానం, స్వామివారి సేవ ముందు నృత్యం, వసంతకేళిలో అధికారులు, భక్తులు వసంతోత్సవ శోభతో పెంచలకోన శోభిల్లింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఉత్సవాంతముగా జరిపే పర్వం చక్రతీర్థ మహోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. తొలుత పుణ్యాహవాచన పూజలు నిర్వహించిన పూజారులు వసంతకేళి జరిపారు. అనంతరం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్యచక్రత్ ఆళ్వర్ల స్నాన ఘట్టాలు కొనసాగాయి. మంగళవాయిద్యాల నడుమ అర్చకులు, భక్తజనులు, దేవస్థాన సిబ్బంది తిరువీధి సేవోత్సవంలో పసుపు, కుంకుమ, గంధం, వివిధ సుగంధాలు వెదజల్లే రంగుల్లో వసంతకేళి నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఈవో శ్రీనివాసులు రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల సతీమణి సింధు, అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, అమ్మవారిని, ఆంజనేయ స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆయన వెంట ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, రాపూరు, మర్రిపాడు ఎస్ఐలు వెంకట రాజేష్, శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

నయనానందకరంగా తెప్పోత్సవం

మంగళవారం సాయంత్రం ప్రధాన ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా పుష్కరిణికి తీసుకొచ్చారు. అనంతరం రాత్రి 8 గంటల ప్రాంతంలో తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం అశ్వవాహనంపై స్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తర్వాత ఆలయంలో ఎగరవేసిన గరుత్మంతుడి చిత్రపటాన్ని దించి ధ్వజారోహణం కార్యక్రమాన్ని జరిపారు. ఇక చివరిరోజు అయిన బుధవారం రాత్రి గోనుపల్లిలో గ్రామోత్సవం జరగనుంది.

హుండీ ఆదాయం రూ.25,51,088

బ్రహ్మోత్సవాలకు ఏర్పాటు చేసిన హుండీలకు భక్తులు భారీగా కానుకలు సమర్పించినట్టు ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం హుండీలను లెక్కించగా, రూ.25,51,088 నగదు, 38 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి వచ్చినట్లు తెలిపారు. అమెరికా 10 డాలర్లు, కువైట్ 7.5 దినార్లు, శ్రీలంక 500 రూపాయల నోటు వచ్చినట్లు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రాజంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 617వ జయంతి వేడుకల సందర్భంగా మంగళవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకలో ఇటు అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఎండీ సర్వేశ్వరి, పి.సుబ్రమణ్యం బృందంచే నిర్వహించిన సంగీత విభావరి విశేషంగా ఆకట్టుకుంది. ఎం.పూర్ణ బృందం నిర్వహించిన హరికథ కళాకారులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు, భజనలను అలరింపజేశాయి. ముఖ్యంగా తాళ్లపాక ధ్యానమందిరంలో అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమాలను వీక్షించేందుకు రాజంపేట చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు హాజరై భక్తిశ్రద్ధలతో తిలకించారు.


సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

బి.కొత్తకోట, మే13(ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం కొనసాగుతోంది. మండలంలోని, తుమ్మనంగుట్ట, గోళ్లపల్లి పంచాయతీల పరిధిలో మూడు చోట్ల చోరీలకు పాల్పడిన దొంగలు మంగళవారం పట్టణ శివారులోని సబ్‌స్టేషన్ సమీపంలో వున్న రైతు వెంకట్రమణకు చెందిన హెచ్‌వీడీయస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని రాగివైరు, ఆయిల్‌లను ఎత్తుకెళ్లారు. బి.కొత్తకోట పోలీసులు దీనిపై దృష్టి సారించి ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలు అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మృతురాలి చేతిపై పేరు గుర్తింపు

రామసముద్రం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎలకపల్లె సమీపంలో ఆదివారం రాత్రి పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన సంఘటనలో మృతి చెందిన మహిళ కుడి చేతిపై యస్మిత పేరు ఉన్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు మృతురాలి కుడిచేతిపై యస్మిత అనే పేరుతో ట్యాటు ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

నలుగురు అరెస్టు

చెన్నూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచిన్నాయపల్లెకు సమీపంలోని వ్యవసాయ పొలాల్లో కోడిపందెం ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు పందెం కోళ్లతో పాటు రూ.4400 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ క్రిష్టారెడ్డి తెలిపారు.

343 గ్రాముల బంగారు చోరీ

● మేనకోడలి వివాహంలో గుర్తుతెలియని వ్యక్తులు అపహరణ ● ఏఎస్పీకి ఫిర్యాదు

రాజంపేటటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): మేనకోడలి వివాహానికి సోదరుడి ఇంటికి వచ్చిన చెల్లెలు బ్యాగులోని బంగారు మాయమైన సంఘటన ఆల్యసంగా వెలుగులోకి వచ్చింది. 343 గ్రాముల బంగారాన్ని పోగొట్టుకుని ఖంగుతిన్న చెల్లెలు చేసేదేమి లేక స్థానిక ఏఎస్పీ మనోజ్ రామ్‌నాధ్‌హెగ్డేకు మంగళవారం ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని కోరారు. బాధితురాలు సానంరెడ్డి నాగమణి కథనం మేరకు.. పట్టణంలోని విద్యుత్ నగర్‌లో నివాసం ఉంటున్న తన అన్న కుమార్తె సాయినందిని వివాహానికి ఏప్రిల్ 28న తిరుపతి నుంచి తాను రాజంపేటకు వచ్చానని, ఆ సమయంలో వెంట తీసుకొచ్చిన బంగారం వధువు స్వగృహంలో బెడ్‌రూంలో భద్రపరిచానన్నారు. అనంతరం వరండాలో నిర్వహిస్తున్న మెహంది కార్యక్రమంలో పాల్గొని తిరిగి రాత్రి 10.30 గంటల సమయంలో తన గదికి వచ్చామన్నారు. ఆ రాత్రి గదిలో అన్న జోగి సుదర్శన్‌రెడ్డి, వదిన జోగి చంగమ్మ, తన కుమార్తె వర్షిణి, పెళ్లికుమార్తె సాయినందిని, అత్త పోలి సరోజనమ్మతో కలిసి తాను నిద్రించానన్నారు. మరుసటిరోజు ఉదయం ఆరు గంటలకు నిద్రలేచి పెళ్లి పనుల్లో నిమగ్నమయ్యామన్నారు. కాగా 10 గంటల సమయంలో స్నానానికి వెళ్లేందుకు బ్యాగు ఓపెన్ చేయగా అందులో చిందరవందరగా దుస్తులు ఉండడం చూసి షాక్‌కు గురయ్యామని, ఓపెన్ చేసి చూడగా బంగారం కనిపించలేదన్నారు. ఈ విషయంపై సీసీ పుటేజీని పరిశీలించినా గుర్తించలేకపోవడంతో అదే రోజు అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. తాము 19 మంది మీద అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశామని, చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించి బంగారం తమకు అందేలా చర్యలు చేపట్టాలని బాధిత మహిళ ఏఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.


అనుమానితులపై ఏఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాధిత మహిళ

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

● అవయవాలు దానం చేసిన కుటుంబసభ్యులు

చిన్నమండెం, మే 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మద్దిరాల కొండారెడ్డి (21) తాను చనిపోతూ మరో 8 మందికి అవయవ దానం చేశారని కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలిలా.... చిన్నమండెం మండలం చాకిబండ గ్రామం అంపాబత్తునివారిపల్లెకు చెందిన మద్దిరాల కొండారెడ్డి బెంగుళూరులో సివిల్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 8వ తేది రాత్రి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే స్థానికుల సమాచారం మేరకు పోలీసులు తీవ్రంగా గాయపడిన కొండారెడ్డిని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. వైద్యుల వైద్య సేవల అనంతరం సోమవారం రాత్రి మృతి చెందినట్లు నిర్ధారించారు. వైద్యుల సూచనల మేరకు కొండారెడ్డి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అవయవాలు దానం చేసి మరికొందరి ప్రాణాలను నిలబెట్టే దిశగా ఆలోచించారు. కొండారెడ్డికి సంబంధించిన గుండె, లివర్, కిడ్నీలు తదితర అవయవాలు దానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

ఇదిలా ఉండగా కుమారుడి చదువు కోసం తల్లిదండ్రులు కంచెంరెడ్డి, కోటేశ్వరమ్మలు ఎన్నో ఏళ్లుగా కష్టపడి వ్యవసాయ పనులు, కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకున్నారు. ఆ డబ్బులతోనే పిల్లలను చదివించుకున్నారు. కుమారుడు కొండారెడ్డి సివిల్ ఇంజనీర్‌గా ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడని సంతోషం వ్యక్తం చేశారు. అయితే అది చాలా రోజులు నిలబడలేదు. విధి ఆడిన వింత నాటకంలో ఆ కుటుంబం ఉన్న ఒక్క కుమారుడిని పోగొట్టుకున్నారు. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో పాటు చాకిబండ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.


మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు, కుటుంబ సభ్యులు, కొండారెడ్డి (ఫైల్)

ఇంటింటా చెట్టు... ఊరూరా వనం లక్ష్యం



నర్సరీల్లో పంపిణీకి సిద్ధమవుతున్న మొక్కలు

- మొక్కల పెంపకానికి సిద్ధమవుతున్న అటవీశాఖ
- జూన్ నాటికి 20 లక్షల మొక్కలు అందుబాటులోకి..
- పండ్లు, అటవీజాతి, ఎర్ర చందనం మొక్కలు
- సామాజిక వన విభాగం ఆధ్వర్యంలో ఎనిమిది నర్సరీలు



యురేనియం ప్రాజెక్టులో నాటిన మొక్కలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : మానవాళి మనుగడకు, కాలుష్య నియంత్రణతో పాటు వర్షాలు సమృద్ధిగా కురవడానికి పచ్చని చెట్లు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటాయి. ఇందుకోసం అడవుల పరిరక్షణతో పాటు ఇంటింటా చెట్టు, ఊరూరా వనం అనే నినాదంతో మొక్క ల పెంపకానికి అటవీ శాఖ చర్యలు చేపడుతోంది. ప్రతి ఏడాది వర్షాకాలంలో ప్రజల ద్వారా మొక్కలను నాటిం చేందుకు ప్రోత్సహిస్తుంది. ఇందులో భాగంగా సామాజిక అటవీ విభాగం ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలను పెంచి ప్రజలకు పంపిణీ చేయడం జరుగుతుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు 20 లక్షల మొక్కలను సామాజిక అటవీ విభాగం పంపిణీకి సిద్ధం చేస్తోంది. ఇందులో పండ్లజాతి మొక్కల్లో జామ, సీతాఫలం, ఉసిరి మొక్కలతో పాటు చింత, కరివేపాకు, కానుగ, మారేడు మొక్కలను పెంచుతున్నారు. అంతేకాకుండా పలు రకాల అటవీ మొక్కలను పెంచి పరిశ్రమల ఆవరణలో, రహదారుల వెంబడి నాటేందుకు సిద్ధం చేస్తున్నారు.

పులివెందుల నియోజకవర్గంలోని యురేనియం ప్రాజెక్టు వద్ద ఇప్పటికే 59 హెక్టార్లలో 1,32,000 మొక్కలను నాటినట్లు అధికారిక యంత్రాంగం పేర్కొంటుంది. ఈ సంవత్సరం మరో వంద హెక్టార్లలో మొక్కలను నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అదే విధంగా రహదారులకు ఇరువైపులా మొక్కలను నాటి వాటిని పరిరక్షించే చర్యలు కూడా చేపడుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పది కిలోమీటర్ల మేర మొక్కలు నాటాలనేది లక్ష్యంగా పెట్టుకున్నట్లు సామాజిక అటవీ విభాగం అధికార యంత్రాంగం చెబుతుంది.

వివిధ నిధుల ద్వారా...

మొక్కల పెంపకానికి వివిధ నిధుల ద్వారా అటవీశాఖ ఖర్చు చేస్తుంది. ఇందులో భాగంగా కంపా గ్రాంట్ కింద లక్ష 60వేల మొక్కలు పెంచి పోషిస్తున్నారు. ఇందులో పండ్ల జాతి కొయ్య జాతి మొక్కలున్నాయి. అదే విధంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 17 లక్షల మొక్కలను తయారు చేస్తున్నారు. ఇందులో పండ్ల జాతికి సంబంధించి సీతాఫలం, జామ, గోరింట, కరివేపాకు, నిమ్మ, వేప, కానుగ, మారేడు, ఉసిరి, చింత మొక్కలతో పాటు అటవీ జాతి మొక్కలు ఉన్నాయి. ఎంబీపీఏఎస్ నిధుల ద్వారా సుమారు లక్ష ఎర్రచందనం మొక్కలను తయారు చేస్తున్నారు. ఎర్రచందనం చెట్ల నుంచి విత్తనాలు సేకరించి మొలకెత్తిస్తున్నారు. ఈ మొక్కలను రైతులకు, ప్రభుత్వ కార్యాలయాలు ఆవరణలో నాటేందుకు పూర్తి ఉచితంగా పంపిణీ చేస్తారు. అయితే మొక్కలు అవసర మైన రైతులు తమ వ్యవసాయ భూమికి సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకం నకలు, ఆధార్‌లను సమర్పించాల్సి ఉంటుంది. అదే విధంగా ప్రైవేటు సంస్థకు ప్రైవేటు వ్యక్తులకు కలెక్టరు ఆధ్వర్యంలో ఏర్పాటు అయ్యే కమిటీ సూచించిన ధరల మేరకు మొక్కలను అందజేయడం జరుగుతుంది.



> **ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి**
>
> పచ్చదనం ప్రగతికి మెట్లు అనే విధంగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా మొక్కల పెంపకానికి ముందుకు రావాలి.తమకు నచ్చిన మొక్కలు తీసుకుని వాటిని నాటడంతో పాటు ఎంతో బాధ్యతగా సంరక్షించాల్సిన అవసరం ఉంది. ప్రజలకు అవసరమైన మొక్కలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
>
> - ఎం.శివకుమార్, డీఎఫ్‌వో, సామాజిక వన విభాగం



రోడ్డు పక్కన నాటిన మొక్కలు

8 చోట్ల నర్సరీలు ఏర్పాటు

సామాజిక వన విభాగం పరిధిలో జిల్లాలో ఎనిమిది చోట్ల నర్సరీలు నిర్వహిస్తున్నారు. కడప నగర పరి ధిలో బుగ్గ డ్యామ్ వద్ద, సీకేదిన్నె మండలంలోని మద్దిమ డుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, కొండా రు, జమ్మలమడుగు, వేంపల్లెలో నర్సరీలు నిర్వహిస్తున్నా రు. ఇవి కాకుండా అటవీశాఖ కూడా జిల్లాలోని పలు ప్రాంతాల్లో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలను తయారు చేస్తుంది. నర్సరీల నిర్వహణకు అవసరమైన నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో వాటి నిర్వహణ కోసం అధికారులు సిబ్బంది సొంత డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉన్నట్లు తెలుస్తుంది. సామాజిక వన విభాగం పరిధిలోనే దాదాపు 50లక్షల రూపాయలు బిల్లులు ఇప్ప టికీ పెండింగులో ఉన్నట్లు సమాచారం. అయినప్పటికీ అటవీశాఖ సామాజిక వన విభాగానికి సుమారు 20 లక్షల రూపాయలు మేర నిధులు కేటాయించడం వల్ల వారికి కొంత మేర ఉపశమనం కలిగినట్లు తెలుస్తుంది.

‘బీజేపీ తిరంగా యాత్ర హాస్యాస్పదం’

వేంపల్లె, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయినందుకు మోదీ ప్రతిభను చాటిచెప్పేందుకు తిరంగా యాత్రను మే 13 నుంచి 23 వరకు నిర్వహించాలని బీజేపీ నిర్ణయించడం హాస్యాస్పమని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. బీజేపీ నాయకులు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పహల్గాం వద్ద భద్రత సిబ్బంది ఉంటే అమాయకులు చనిపోయేవారు కాదన్నారు. పహల్గాంలో పాల్గొన్న ఉగ్రవాదులను ఎంతమందిని పట్టుకున్నారో, ఎంత మం దిని మట్టుబెట్టారో కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

నేత్రదానం... ఇద్దరి అంధులకు వెలుగు



మౌనిక

కార్నియాలను అందిస్తున్న తలిదండ్రులు

వీరపునాయునిపల్లె, మే 13 (ఆంధ్రజ్యోతి): గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన నేసే మౌనిక (18) నేత్రదానంతో మరో ఇద్దరి అంధులకు వెలుగులు పంచనుందని స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు అన్నారు. మండలంలోని పాయసంపల్లెకు చెందన లక్ష్మీదేవి, సురేష్‌ల కుమార్తె మౌనిక మంగళవారం మరణించారు. తమ కుమార్తె మరణించిన పుట్టెడు దుఃఖంలోను నేత్రదానం చేసేందుకు ముందుకు వచ్చిన తల్లిదండ్రులను గ్రామస్థులు అభినందించారు.

కనుల పండువలా కల్యాణోత్సవం



భక్తులకు తాళిని చూపుతున్న పూజారులు, హాజరైన భక్తులు

పెండ్లిమర్రి, మే 13 (ఆంధ్రజ్యోతి): వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వెయ్యినూతులకోన ఆలయంలో గజవాహనవాహన సేవలో లక్ష్మీనృసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం భక్తుల సమక్షంలో పూజారులు లక్ష్మీ నృసింహస్వామి కల్యాణాన్ని కనుల పండువలా నిర్వహించారు. మధ్యాహ్నం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణం కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని వేదపారాయణంలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పిన్నపాటి హరిప్రసాద్ పర్యవేక్షించారు.

సింహ వాహనంపై నారాపురం వేంకటేశ్వరస్వామి



జమ్మలమడుగు, మే 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నారాపురం వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారు సింహవాహనంపై ఊరేగి భక్తులకు కనువిందు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత నారాపురం వేంకటేశ్వర స్వామి ముత్యపు పందిరి వాహనంలో పూజలు అందుకున్నారు. అనంతరం స్నపన తిరుమంజసం కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం ఊంజల్ సేవ, అన్నమాచార్య కీర్తనలు, అనంతరం సింహ వాహనంపై ఊరేగారు. రాత్రి హరికథ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

గజవాహనంపై...చెన్నకేశవుడు



రాజుపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వెల్లాల బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి గజావాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి వాహనసేవను ఆలయ మాడవీధుల్లో ఊరేగింపు చేశారు. జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనరు మల్లి కార్జున ప్రసాద్ వెల్లాలను సందర్శించారు. . బుధవారం జరిగే స్వామి వారి రథోత్సవ వివరాల గురించి బ్రహ్మోత్సవాల కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు జీఎల్ నారాయణరెడ్డి పాల్గొన్నారు. ప్రొద్దుటూరు సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ వెంకటరమణ బ్రహ్మోత్సత కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మహిళ ఆత్మహత్య

జమ్మలమడుగు, మే 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు గ్రామంలో తలారి అంజనమ్మ (43) అనే మహిళ సోమవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... గత కొద్ది రోజులుగా అంజనమ్మ కడుపునొప్పితో బాధపడుతుండేది. కడుపు నొప్పి తగ్గకపోవడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలోకి తరలించగా అప్పటికే మృతి చెందింది. మంగళవారం ఉదయం జమ్మలమడుగు అర్బన్ పోలీసులు సీఐ లింగప్ప, ఎస్ఐ రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలికి భర్త శంకర్, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

బాలిక ఆత్మహత్య



కడప క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి): కడప నగ రం వైఎస్ఆర్ కాలనీలో షేక్ సల్మా (14) అనే బాలిక సోమవారం రాత్రి ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చిన్నచౌకు ఎస్ఐ రవికు మార్ వివరాల మేరకు.. వైఎస్ఆర్ కాలనీకి చెందిన సల్మా తండ్రి గత ఏడాది చనిపోవడంతో బాలిక ఇంటి వద్దనే ఉంటోంది. సెల్‌ఫోనులో ఇన్‌స్టాగ్రామ్ ఎక్కువ చూస్తుండ డంతో బాలిక తల్లి మందలించింది. దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఎవరూ లేనప్పుడు ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మ హత్యకు పాల్పడింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేపినట్లు తెలిపారు.

గుండెపోటుతో గుర్తు తెలియని ప్రయాణికుడు మృతి



సీకేదిన్నె, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న గుర్తు తెలియని ప్రయాణికుడు మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. కడప నుంచి రాయచోటికి వెళుతున్న బస్సు మూలవంక వద్దకు రాగానే ఓ ప్రయాణికుడికి అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. గుర్తించిన తోటి ప్రయాణికులు డ్రైవర్, కండక్టర్‌కు సమాచారం అందించడంతో బస్సును ఆపి 108కు సమాచారం ఇచ్చి రిమ్స్‌కు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆర్టీపీపీకి భూములు కోల్పోయిన వారికి న్యాయం చేయాలి

- ఎమ్మెల్యే ఆది, భూపేశ్‌రెడ్డి



ఏపీ జెన్‌కో ఎండీకి వినతి పత్రాన్ని ఇస్తున్న ఎమ్మెల్యే ఆది, భూపేశ్‌రెడ్డి

ఎర్రగుంట్ల, మే 13(ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీలోని 600ప్లాంటు నిర్మాణానికి భూములు కోల్పోయిన వారికి వెంటనే న్యాయం చేయాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ జమ్మలమడుగు ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డిలు మంగళవారం విజయవాడలో ఏపీ జెన్‌కో ఎండీ చక్రధర్‌బాబుకు వినతిపత్రాన్ని ఇచ్చారు. ప్లాంటుకు భూములిచ్చి చాలా కాలం అయినప్పటికి ఇప్పటి వరకు వారికి న్యాయం జరగలేదని తెలిపారు. 600 మెగావాట్లకు సంబంధించి సుమారు 600 ఎకరాలకు వరకు భూమిని తీసుకున్నారు. అయితే 1 నుంచి 4వ రీచ్ వరకు ఇప్పటికే మెయింటెనెన్స్‌లో 120 మందికి, పర్మనెంట్ కింద 100 మంది కి ఉద్యోగాలిచ్చారు. 5, 6 రీచ్‌లలో 150 ఎకరాలకు సంబంధించి 140 మంది రైతులు ఉన్నారన్నారు. ఈవిషయంపై ఎండీ స్పందిస్తూ త్వరలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కలమల్ల బాబు, సున్నపురాళ్ల మణినాథ్‌రెడ్డి, భూచుపల్లె రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన నల్లగంగమ్మ జాతర



ప్రత్యేక అలంకణలో అమ్మవారు

సంబేపల్లె, మే13(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె దేవరరాయి నల్లగంమ్మ జాతర సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మంగళవా రం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులను తీర్చుకోవడంతో జాతర ముగిసింది. సోమవారం రాత్రి ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిపోయింది. భక్తుల కాలక్షేపం కొరకు ఆర్కెస్ట్రా కార్యక్రమం నిర్వహించారు. దాతలు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ప్రత్యేక పూజ లు, హోమాలు నిర్వహించారు. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మం త్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుటు ంబ సమేతంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తుల కోలాహల మధ్య జాతర అట్టహాసంగా ముగిసింది.

‘వేతనాలు పెంచకపోతే ఉద్యమిస్తాం’



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్‌కు నిరసన తెలుపుతామని వినతిపత్రం ఇస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలు

వేంపల్లె, మే 13 (ఆంధ్రజ్యోతి): పనికితగ్గ వేతనం ఇవ్వకపోతే ఆర్జీయూకేటీ నూతన అడ్మిషన్ల సమయంలో ధర్నా చేస్తామని గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటించారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో గెస్ట్‌ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ ఆధ్వర్యంలో ఇడు పులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్‌కుమారస్వామి గుప్తకు మంగళవారం వినతపత్రం ఇచ్చారు. 2018లో జాయిన్ అయిన గెస్ట్ ఫ్యాకల్టీకి ఇప్పటి వరకు పనికితగ్గ వేతనం ఇవ్వలేదని తెలిపారు. ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీకి 110జీఓ అమలు చేసి రూ.40వేలు వేతనం ఇవ్వాలని ఎన్నిసార్లు అడిగినా అధికారులు పట్టించుకోలేదన్నారు. సమస్య పరిష్కారం కోసం ఆర్జీయూకేటీ నూతన అడ్మిషన్ కోసం జూన్ 11, 12, 13 తేదీలలో అడ్మిషన్ ప్రక్రియ నిర్వహించనుందని.. ఆ సమయంలో నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో పనిచేస్తున్న గెస్ట్‌ఫ్యాకల్టీతో ధర్నా చేస్తామని స్పష్టం చేశారు.

‘స్టెమీతో గుండెకు భరోసా’

చెన్నూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా రూ.45వేలు విలువ చేసే గుండెకు సంబంధించిన ఇంజక్షన్ అందిస్తుందని చెన్నూరు సీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ సాగర్‌కుమార్‌లు తెలిపారు. స్థానిక సీహెచ్‌సీలో మంగళవారం ఏఎన్ఎంల, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ గతంలో అనుకోకుండా చాతి నొప్పి వస్తే సకాలంలో సరైన వైద్యం అందుబాటులో లేక ఇబ్బంది పడేవారని, ఇప్పుడు సీహెచ్‌సీలో రూ.45వేలు విలువ చేసే గుండెకు సంబంధించిన స్టెమీ ఇంజక్షన్ అందుబాటులో ఉందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు గుండె జబ్బు లక్షణాలు వచ్చిన వెంటనే గంటలోపు ప్రభుత్వ ఆసుపత్రికి తీసకువస్తే వైద్య పరీక్షలు చేసి స్టెమీ (టెనెక్టి ప్లస్) ఇంజక్షన్ ఉచితంగా ఇస్తారని ఆయన తెలిపారు.

కేకే కొట్టాల గ్రామాన్ని యూసీఐఎల్ తీసుకోవాలి



కలెక్టర్‌ను కలిసేందుకు ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న కేకే కొట్టాల ప్రజలు

వేముల, మే 13 (ఆంధ్రజ్యోతి): యూసీఐఎల్ టైలింగ్ పాండ్ వల్ల నష్టపోయిన కేకే కొట్టాల గ్రామాన్ని యూసీఐఎల్ యాజమాన్యం తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కడప ఎంపీ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కేకే కొట్టాల గ్రామ ప్రజలు కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా టైలింగ్‌పాండ్ వల్ల నష్టపోయామని, గ్రామాన్ని యూసీఐఎల్ యాజమాన్యం తీసుకొని పునరావాసం, పర్మినెంట్ ఉద్యోగ అవకాశం, నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. అప్పటి వరకు టైలింగ్‌పాండ్ నిర్మాణ పనులు పూర్తిగా నిలిపివేయాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరలో గ్రామాన్ని టైలింగ్ పాండ్‌ను పరిశీలించి న్యాయం చేస్తానని చెప్పినట్లు ప్రజలు తెలిపారు. ఈకార్యక్రమంలో లావనూరు అంకిరెడ్డి, కె.కె.కొట్టాల గ్రామ సర్పంచు రంగనాథం, సింగంశెట్టి మోహన్‌బాబు, శ్రీనివాసులు, రాజశేఖర్, గంగాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంక్‌లోకి.. లేడీ దొంగలు

మహిళ సంచిలోని పొదుపు డబ్బులతో ఉడాయించిన వైనం

ప్రొద్దుటూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం గాంధీరోడ్డులోని ఇండియన్ బ్యాంకులో మహిళ వద్ద ఉన్న సంచిని బ్లేడుతో కోసి డబ్బులు కాజేసి ఇద్దరు కిలాడీ మహిళా దొంగలు ఉడాయించిన సంఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. త్రీటౌన్ సీఐ గోవింద రెడ్డి వివరాల మేరకు...

పట్టణంలోని హనుమాన్ నగర్‌కు చెందని శ్రీమహాలక్ష్మీ డ్వాక్రా మహిళా సంఘానికి చెందిన బొందెల సంజీ వమ్మ అనే మహిళ గ్రూపు పొదుపు డబ్బులు రూ.59,800 ఖాతాలో జమ చేయడానికి ఇండియన్ బ్యాం కుకు వచ్చింది. నోట్లు రాసుకోవడానికి డబ్బులు సంచి లోంచి బయటకు తీసి లెక్కబెట్టుకుంది. కట్టలు కట్టి మళ్లీ కట్టెల సంచిలో వేసుకుంది. గ్రూప్‌లోని మరో సభ్యురాలి అప్పు తీర్మానం జిరాక్స్ తీసుకురమ్మని తన సోదరుడిని పంపడానికి పని పురమాయించింది. డబ్బు ఉన్న సంచి చంకలో పెట్టు కొని వుండటాన్ని గమనించిన ఇద్దరు కిలాడిలేడీలు సంజీవమ్మ వెనక్కి ఆనుకొని వెళ్లి బ్లేడుతో సంచిని కోసి డబ్బుల కట్టను కాజేసి వెంటనే బ్యాంకు నుంచి ఉడాయించారు. సంచిలోని డబ్బులు పోయిన విషయం గ్రహించిన సంజీవమ్మ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీ సులు బ్యాంకులో సీసీ కెమెరాలు పరిశీలించి ఇద్దరు మహిళలు ఈ దొంగ తనం చేసినట్లు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ గోవిందరెడ్డి తెలిపారు. ఈ కిలాడీ లేడీ దొంగ లను పట్టుకోవడానికి ప్రత్యేక పోలీసు టీంలను వేసి గాలిస్తున్నామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF SURNAME
I, BEERAM MURRIAHGARI VEDHAVATHI (old Name) W/o BEERAM MURRIAH GARI RAMANJANEYA REDDY, R/o FLOT NO:408, D-Block,CPR Urban Apartment,Renigunta Road, Tirupati Dt Ap.I Have Changed My Sur Name As NARPALA VEDHAVATHI (New name
AJC-233410

WANTED
మీరు 10th క్లాస్ పాస్ అయి ఉన్నారా! అయితే ఎల్ఐసి భీమాసఖి (జీతం+ కమీషన్) కొరకు సంప్రదించండి. AKCS రెడ్డి, LIC of India, Tirupati. Cell:90599 19948
AJT - 1221

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 237544

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా పంపించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆధార్ కేంద్రాలు ఏవీ?

- ఆధార్ నమోదు..సవరణల కోసం జనం నరకయాతన
- డిమాండు ఎక్కువ.. నమోదు కేంద్రాలు తక్కువ
- ఎన్‌రోల్‌మెంట్‌లో సిబ్బంది ఇష్టారాజ్యం



ఆపరేటర్ లేని కాట్నగల్లు సచివాలయం



బి.కొత్తకోట ఇందిరమ్మ కాలనీ సచివాలయంలో కిక్కిరిసిన ఆధార్ కేంద్రం

బి.కొత్తకోట, మే 13(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు సవరణలకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో జనం ఒక్కసారిగా ఆధార్ కేంద్రాల మీద పడుతున్నారు. అయితే అధికారులు అందుకు సరిపడా కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో అనేక అక్రమాలకు అవకాశం ఏర్పడుతోంది. డిమాండు తగినట్లుగా ఆధార్ కేంద్రాలు లేక పోవడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యం గా వ్యవహరిస్తున్నారు. బి.కోత్తకోట నగర పంచాయతీ పరిధిలో ని ఇందిరమ్మ కాలనీ సచివాలయంలో కేవలం ఒకేఒక్క ఆధార్ కేంద్రం ఉంది. కొంతకాలం బీరంగి సచివాలయంలో నిర్వహించిన కేంద్రాన్ని గుమ్మసముద్రంకు మార్చారు. అయితే అక్కడి డిజిటల్ అసిస్టెంట్ బాబాఫకృద్దీన్ నెలరోజులు తిరక్కుండానే ఎటువంటి సమాచారం లేకుండా ఆధార్‌నమోదు సామగ్రిని యథాస్థానానికి చేర్చడంతో ప్రస్తుతం అది నిరుపయోగంగా మారింది. దీని గురించి పట్టించుకునే నాథుడు లేడు. తుమ్మనంగుట్ట సచివాలయంలో మరో కేంద్రం పెట్టారు. పీటీఎం మండలంలో పీటీఎం, కాట్నగల్లులో మాత్రమే నమోదు కేంద్రాలు ఉండేవి. కాట్నగల్లు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ములకలచెరువుకు బదిలీ కావడంతో సేవలకు బ్రేక్ పడింది. ప్రతి చోట సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌కు లాగిన్ ఇవ్వడంతో సమస్య తీవ్రమైంది. సచివాలయంలో మీ-సేవ సర్వీసులు కూడా ఈ వ్యక్తి చేయాల్సిరావడం, ఆధార్ సర్వర్ మొరాయించడం లాంటి సమస్యలతో ఆధార్ నమోదు నత్తనడకన సాగుతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇప్పట్లో ఆధార్‌సవరణలు జరిగే పరి స్థితి కానరావడం లేదు.

అధిక రుసుము వసూళ్లు..

ఆధార్ సవరణలకు ఉన్న డిమాండ్‌ను ఆసరాగా చేసుకొని ఆపరేటర్లు జనం నుంచి లూటీ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నా యి. బెంగళూరులో ఉద్యోగాలు చేసుకునే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వలస వెళ్లిన సాధారణ ప్రజలు తమ ఆధార్‌సవరణ త్వరగా చేసెయ్యాలని రూ.2000- 3000 వేలు ముట్టజెబుతున్నట్లు తెలుస్తోంది. అలా పెద్ద మొత్తంలో చేతులు తడిపిన వారికి, సిఫారసులున్న వారి కి ఉదయం 8లోగా, లేదా సాయంత్రం 6 తర్వాత రప్పించుకొని ఆధార్ సవరణలు చేస్తున్నారని, తమకు మాత్రం సర్వర్ పని చేయలేదని చెప్తున్నారని పలువురు బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డిమాండుకు తగ్గ ఆధార్‌కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఆయా కేంద్రాలు అక్రమాలు, అవినీతి జరగకుండా సామాన్యులకు న్యాయం జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

చీకిలబైలులో గంగజాతర



జాతరకు హాజరైన కూటమి నాయకులకు స్వాగతం పలుకుతున్న సర్పంచ్ ప్రభాకర్

మదనపల్లె టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకిలబైలు గ్రామ పంచాయతీలో మంగళవారం గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు, జనసేన రాయలసీమ కోఆర్డినేటర్ రాందాస్‌చౌదరి, తంబళ్లపల్లె టీడీపీ కోఆర్డినేటర్ సీడ్ మల్లికార్జున నాయుడు గం గమ్మను దర్శించుకున్నారు. రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్, సర్పంచ్ ప్రభాకర్ ఆధ్వ ర్యంలో కూటమి నాయకులకు విందు ఏర్పాటు చేశారు.

ఘనంగా కోదండరాముడి కల్యాణం

నిమ్మనపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): కోదండ రామాలయ బ్రహోత్సవాలలో భాగంగా మండలం లోని అగ్రహారంలో మంగళవారం ఉదయం కోదండ రాముడికి సీతమ్మ కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం సీతారాములను ఊరేగించారు.

మోహిని అలంకారంలో చెన్నకేశవుడు

నిమ్మనపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టూరు పంచాయతీలో ఉన్న ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం మోహిని ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 14న స్వామి వారి కల్యాణోత్సవము, గరుడ సేవ, 15వ తేదీ రథోత్సవము నిర్వహిస్తామని తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి : ఎమ్మెల్యే



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమ్మచెరువుమిట్ట ఒకటో వార్డులో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆ వార్డులో ఎమ్మెల్యే పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం వేంపల్లె పంచాయతీ నల్లగుట్టపల్లెకు చెందిన సి.రామకృష్ణకు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.84 వేల చెక్కును పంపిణీ చేశారు. ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన రథోత్సవంలో పాల్గొన్నారు. టౌన్‌బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, జేవీ రమణ, నవీన్‌చౌదరి, బైగారి భారతి, నాగమణి పాల్గొన్నారు.

● చౌకదుకాణ డీలర్లు ఎండీయూ ఆపరేటర్లకు సహకరించాలని ఎమ్మెల్యే సూచించారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసం వద్ద ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.ఫిరోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో చౌకదుకాణ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ శివారులోని పలు కాలనీల ప్రజలకు బియ్యం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రజలకు చౌకదుకాణాల నుంచి నిత్యావసర వస్తువులు పంపిణీ చేయకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నియోజకవర్గంలో రేషన్‌కార్డు దారులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్‌కు సూచించారు.

బుద్ధుని కొండలో వైభవంగా బుద్ధపున్నమి వేడుకలు



సంఘీభావ ధ్యానం చేస్తున్న ఉపాసకులు

మదనపల్లె, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకిశెట్టిపల్లె వద్దనున్న బుద్ధునికొండపై మంగళవారం బుద్ధపున్నమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తథాగతుడు గౌతమ బుద్ధుని 2569వ జయంతిని పురస్కరించుకుని బుద్ధ అంబేద్కర్ సమాజ్, భారతీయ అంబేద్కర్ సేన సంయుక్తంగా ఆ వేడుకలు నిర్వహించాయి. బౌద్ధ ఉపాసకులు బోధి వృక్షం చుట్టూ ప్రదక్షణలు చేసి పూజలు నిర్వహించారు. రకరకాల పుష్పాలతో అలంకరించిన బుద్ధుని ప్రతిమలతో తథాగతుడి ప్రధాన విగ్రహం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధ అంబేద్కర్ సమాజ్ ఫౌండర్ ట్రస్ట్ నిర్వాహకుడు పీటీఎం శివ ప్రసాద్, ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప మాట్లాడుతూ సంస్కర్తలం దరిలోనూ అత్యుత్తముడు బుద్ధుడని, ఆయన జన్మించింది, జ్ఞానోద యం పొందింది పరినిర్వాణం పొందింది పౌర్ణమి రోజేనన్నారు. బౌద్ధాన్ని అక్కున చేర్చుకున్న దేశాలు వేగంగా అభివృద్ధి చెందు తుంటే భారత దేశం బౌద్ధాన్ని దూరం చేసుకోవడం వల్ల అభి వృద్ధికి నోచుకోలేకపోతోందన్నారు. ఆకలి, పేదరికం, నిరుద్యోగం, కుల - మత, లింగ అసమానతలతో విలవిలలాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ధ్యానంతో త్రివిధ దళాల సైనికులకు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ ఉపాసకులు నీరుగట్టు రమణ, చాట్ల బయన్న, ముత్యాల మోహన్, మలారి గిరిబాబు, బీవీ రమణ, సొన్నికంటి రెడ్డెప్ప, బండకొండ రవి, డాక్టర్ గంగాద్రి, రవిశంకర్, గంగాధర్, తలారి కృష్ణ, జనార్ధన్, చిన్నా, శశికుమార్, శాంతమ్మ, శంకరమ్మ, గుంగులమ్మ, ఈశ్వరమ్మ, నాగమణి, దేవి, సుమలత, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ దారిపోయినది

శ్రీపి.అశోక్‌కుమార్‌రెడ్డి, S/o పి.రామ మోహన్ రెడ్డి R/o D.No.5-2 బజారువీధి, చింతపర్తి గ్రామం, వాయల్పాడు మండలం, అన్నమయ్య జిల్లా, A.P., అను నాకు సంబం ధించిన నా రిజిస్టర్ సేల్ డీడ్ డాక్యుమెంట్ సర్వే నెం. 379 మరియు 379/1, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, మదనపల్లి వారు జారీ చేసిన డాక్యుమెంట్ నెం. 5281/1989 కింద రిజి స్టర్ చేయబడింది. ఇది 07-11-2024న చింతపర్తి నుండి వాయల్పాడుకు మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్నప్పుడు దారిపోయినది. దొరికిన వారు దయచేసి సెల్: **63003 57335** కు తెలియజేయగలరు.

పెయిన్ కిల్లర్స్ వాడకం ఆరోగ్యానికి హానికరం

పీలేరు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): అతిగా పెయిన్ కిల్లర్స్ వాడితే తీవ్ర అనారోగ్యానికి గురౌతామని డాక్టర్ రమేష్, డాక్టర్ సంతోష్‌కుమార్ తెలిపారు. మంగళవారం పీలేరు మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీవో శివశంకర్ అధ్యక్షతన ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ పెయిన్ కిల్లర్స్ మన శరీరంలోని అవయవాలపై ప్రభావం చూపుతున్నాయని సూచించారు. అతిగా ఫోన్ వాడడంతో బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. హౌసింగ్ ఏఈ రమణ, ఏవో రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ మెకానిక్‌లను ప్రభుత్వం ఆదుకోవాలి..

బి.కొత్తకోట, మే13(ఆంధ్రజ్యోతి): బైక్ మెకానిక్‌ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బి.కొత్తకోటలో బైక్ మెకానిక్‌ల యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సాంబశివ మాట్లాడుతూ మెకానిక్‌లకు బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి వారి నైపుణ్యాన్ని పెంచాలన్నారు. అనంతరం బైక్ మెకానిక్‌ల యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడుగా సలీంబాషా, అధ్యక్షుడిగా మాలిక్, ఉపాధ్యక్షుడుగా ధన, వెంకటేష్, తదితరులు ఎన్నికయ్యారు.

విభజన కోసం పబ్లిక్ నోటీసు

1. నా క్లయింటు వారణాసి వి.మౌలిక రెడ్డి కుమార్తె దివంగత శ్రీ వి. తిరునాథ రెడ్డి నివాసము : హైదరాబాద్ గారి తరపున వారి తల్లిగారైన వారణాసి భాను రేఖ సూచనల మేరకు, నేను ఇందుమూలంగా ఈ క్రింది నోటీసు జారీ చేస్తున్నాను.
నా క్లయింట్ తెలుపునది ఏమనగా అమె తాత శ్రీ వి. కొండా రెడ్డి వారి పూర్వీకుల ఆస్తులను శ్రీ వి. విశ్వనాథ రెడ్డి మరియు అమె తండ్రి (లేటు) శ్రీ వి. తిరునాథ రెడ్డి మధ్య ఎకరాల 18-48 సెంట్లు విస్తీర్ణంలో రెండు సమాన భాగాలుగా విభజించాలని నా క్లయింట్ ఇందుమూలంగా ఈ విభజన నోటీసును లేవనెత్తుతున్నారు. ఈ భూమి బోడుమల్లువారిపల్లె గ్రామ పంచాయతీ, పీలేరు, అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, భారతదేశం (గతంలో చిత్తూరు జిల్లా) సర్వే నెం.688 రు ఎకరాలు 3.19 సెంట్లు, సర్వే నెం.689 రు ఎకరాలు 0.39 సెంట్లు, సర్వే నెం.692/2 రు ఎకరాలు 3.45 సెంట్లు, సర్వే నెం.691/1 రు ఎకరాలు 0.84 సెంట్లు, సర్వే నెం.691/3 రు ఎకరాలు 1.08 సెంట్లు, సర్వే నెం.691/4 రు ఎకరాలు 0.49 సెంట్లు, సర్వే నెం.690 రు ఎకరాలు 0.69 సెంట్లు, సర్వే నెం.689 రు ఎకరాలు 0.12 సెంట్లు, సర్వే నెం.691/2 రు ఎకరాలు 0.04 సెంట్లు, సర్వే నెం.692/1 రు ఎకరాలు 0.20 సెంట్లు, సర్వే నెం.207 రు ఎకరాలు 0.68 సెంట్లు, సర్వే నెం. 696/2 రు ఎకరాలు 0.24 సెంట్లు చట్టపరమైన వారసులు వి. జితేంద్ర రెడ్డి తండ్రి వి. విశ్వనాథ రెడ్డి, శైలజ (విభజన డీడ్ రిజిస్ట్రేషన్ సమయంలో వి. విశ్వనాథరెడ్డి రేషన్‌కార్డులో సమర్పించిన తప్పుడు సమాచారంలో పేరు ప్రస్తావించబడింది) తండ్రి వి. విశ్వనాథ రెడ్డి, వి. మౌలికా రెడ్డి, తండ్రి దివంగత వి. తిరునాథ రెడ్డి, వి. దీప్తికా రెడ్డి తండ్రి దివంగత వి. తిరునాథ రెడ్డి సంతకం చేయలేదు. వారణాసి తిరునాథ రెడ్డి కుటుంబం క్రింది సర్వే నెంబర్లు 688, 689, 692/2, 691/1, 691/3, 691/4, 690, 689, 691/2, 692/1, 207, 696/2 సమాన మరియు న్యాయమైన వాటా పొందాలి. చట్టబద్ధ వారసులు ఎవ్వరు కూడా ఈ పంపకము దస్తావేజు పైన సంతకములు చేయలేదు మరియు 2015 సంవత్సరములో జరిగిన భాగపరిష్కారం రిజిస్ట్రేషన్ చెల్లబడదు అని ఇందుమూలముగా తెలియచేయుచున్నాము.
2. నా క్లయింట్ తెలుపునది ఏమనగా, అమె కూడా యస్.వి. మహల్ థియేటర్ మరియు యస్.వి. డీలక్స్ థియేటర్ యొక్క సహ యజమాని ఇవి ఎ.పి.లోని అన్నమయ్య జిల్లా, పీలేరు టౌన్లో ఉన్నాయి. హిందూ వారసత్వ చట్టం ప్రకారం ఇంకా పైన పేర్కొన్న సర్వే నెంబర్లకు సంబంధించి కుటుంబ సభ్యుల మధ్య మరియు పైన పేర్కొన్న 2 వాణిజ్య థియేటర్లకు సంబంధించి విభజన చర్యలు జరగనందున ముందు చేసిన ఏ విభజన చట్టపరంగా ఎటువంటి చెల్లుబాటు ఉండదు అని ఇందుమూలముగా తెలియచేయుచున్నాము.
3. నా క్లయింట్ తెలుపునది ఏమనగా, పీలేరు టౌన్ పోలీసు స్టేషన్ ముందు 800 చదరపు గజాలు విస్తీర్ణంలో ఉన్న కుటుంబ సభ్యుల మధ్య విభజించబడని స్థలం కూడా ఉంది. చట్టరీత్యా అమె వారసురాలైనందున, అమె అనుమతి లేకుండా ఏదైనా పార్టీ విభజించబడని పైన పేర్కొన్న స్థలాన్ని కొనుగోలు చేయడానికి సంప్రదించినట్లయితే చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుంది అని ఇందుమూలముగా తెలియచేయుచున్నాము.
4. నా క్లయింట్ తెలుపునది ఏమనగా, సాదుమ్ రోడ్ వైపు స్మశాన వాటిక కోసం ఉపయోగించబడుతున్న ఒక అవిభక్త ఆస్తి వుంది. నా క్లయింట్ ఈ ఆస్తి యొక్క చట్టపరమైన వారసులలో ఒకరని, ఎవరైనా కొనుగోలు చేయడానికి, నిర్మించడానికి లేదా లే అవుట్ చేయడానికి ప్రయత్నిస్తే అట్టివారు చట్ట పరమైన పరిణామాలను ఎదుర్కొంటారు.
5. నా క్లయింట్ తెలుపునది ఏమనగా, అమె కుటుంబ సభ్యులు మరియు ఇంటి పెద్దలు కొంత భూమిని WAQF బోర్డుకు, TTD బోర్డుకి వారణాసి తిరునాథ రెడ్డి స్మారకముగా పై సర్వే నెంబర్లలో కొంత భూమిని దానముగా ఇవ్వుటకు మరియు కొంత భూమిని ఆర్థికముగా వెనుకబడిన బలహీన వర్గాల వారికి మరియు సాధారణ తక్కువ ఆదాయము కలిగిన వారికి, సొసైటీలకు, మతపరమైన సంస్థలకు, ఆర్థిక సంస్థలకు, ఇచ్చే ఉద్దేశ్యము కలిగి ఉన్నారు. పైన పేర్కొన్న ఆస్తులపై ఎటువంటి ఆర్థిక రుణాలు లేదా తనఖాలు పెట్టవద్దని మరియు పైన పేర్కొన్న ఆస్తులకు సంబంధించి ఎలాంటి ఒప్పందాలు, యం.ఓ.యు.లు లేదా అమ్మకం / కొనుగోలు చేయవద్దని ప్రజలకు ఇందుమూలంగా తెలియజేస్తున్నాను. సంబంధిత పార్టీలందరూ పైన పేర్కొన్న ఆస్తులతో వ్యవహరించవద్దని ఇందుమూలంగా తెలియచేస్తున్నాము. పైన పేర్కొన్న ఆస్తులపై ఎవరికైనా అభ్యంతరాలు/ క్లెయిమ్స్ లేదా హక్కులు ఉంటే ఈ హెచ్చరిక/పబ్లిక్ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 15 రోజులలోపు సంబంధిత పత్రాల కాపీలతో పాటు వారి క్లెయిములను క్రింద సంతకం చేసిన కార్యాలయ చిరునామాకు సమర్పించాలని ఇందుమూలంగా సూచించబడింది. లేని పక్షంలో నా క్లయింటు తదుపరి చర్యలు చట్టపరంగా తీసుకుంటారు మరియు చట్టం మరియు హిందూ వారసత్వ చట్టం ప్రకారం పైన పేర్కొన్న ఆస్తుల విభజనకు తగిన చట్టపరమైన చర్య/చర్యలు తీసుకుంటారు అని ఇందుమూలముగా తెలియచేయుచున్నాము.

(Claint Nos. P.HARSHA REDDY ✆ 83743 90599
K. ASHWIN +15 613101323)
M. RAMCHANDER RAO GUPTA, Advocate, Office:11-6-646,
Opp: Nampally Criminal Courts, Red Hills, Nampally, Hyd - 500004, Ph : 79810 17444

బాల్య వివాహాలు అభివృద్ధికి అవరోధాలు



బొమ్మనచెరువులో కిశోర వికాసం కార్యక్రమంలో సూచనలిస్తున్న సీడీపీవో సుజాత

పీలేరు, మే 13(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు సమాజ అభివృద్ధికి అవరోధాలని పీలేరు మండలం తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి రమేశ్ రెడ్డి తెలిపారు. మండలంలోని జాండ్ల గ్రామంలో మంగళవారం 'బాల్య వివాహాలు-అనర్థాలు' అనే అంశంపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాలోచిత నిర్ణయాలు, ఆకర్షణలు, అవగాహన రాహిత్యంతో అధిక శాతం బాల్యవివాహాలు జరుగుతున్నాయన్నారు. అటువంటి వారిలో కాన్పుకు తట్టుకునే శక్తి లేకపోవడం, పిల్లలను పెంచే నైపుణ్యం లేకపోవడం, నెలలు నిండకనే కాన్పులు అయిపోవడం, తక్కువ బరువుతో పిల్లలు పుట్టడం, మాతా శిశు మరణాలు సంభవించడం జరుగుతున్నాయన్నారు. జీవితంలో ఉన్నతంగా స్థిరపడే వరకు వివాహ ఆలోచన చేయరాదని సూచించారు. అనంతరం తమ గ్రామంలో బాల్య వివాహాలు జరగకుండా సహకరిస్తామని గ్రామస్తులు, విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ నీలిమ, హెచ్‌ఈ కొండయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమా, ఏఎన్‌ఎంలు రెడ్డిబీ, కృష్ణమ్మ, మహిళా పోలీసులు భాగ్యలక్ష్మి, దివ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : కిశోర బాలికలు తప్పని సరిగా మహిళా చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అంగన్‌వాడి సూపర్‌వైజర్ నాగరత్నమ్మ సూచించారు. తుమ్మరకుంట అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడారు.

మదనపల్లె టౌన్ : బొమ్మనచెరువు అంగన్‌వాడి కేంద్రంలో వికాసం సీడీపీవో సుజాత మాట్లాడుతూ కిశోర బాలికలు ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

బి.కొత్తకోట : గట్టు పంచాయతీ పరిధిలోని పత్రవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ జయరాణి కిశోరివికాసం కార్యక్రమం నిర్వహించారు.

పెద్దతిప్పసముద్రం:తుమ్మరకుంట అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ నాగరత్నమ్మ మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు.

కలికిరి: కిశోరి బాలికలు ప్రస్తుతమున్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ అధికారులు సూచించారు. మంగళవారం కలికిరిలో నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమానికి హాజరైన కిశోరి బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా విద్యా హక్కు చట్టం, బాల్యవివాహ నిషేధిత చట్టం, బాల కార్మిక నిర్మూలన చట్టం గురించి వివరించారు. చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్లు 1098, 112, పోలీసు హెల్ప్‌లైన్ 100ల ప్రాధాన్యత గురించి విడమర్చి చెప్పారు. పోక్సో కేసుల వల్ల కలిగే రక్షణ విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు వినతి

మదనపల్లె అర్బన్, మే13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంక్కిశెట్టిపల్లె పంచాయతీలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం మాలమహానాడు నాయకులు సర్పంచ్ శరత్‌రెడ్డికి వినతిప్రతం అందించారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు గుండా మనోహర్ మాట్లా డుతూ భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని, పంచాయతీలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని సర్పంచ్‌కు విన్నవించారు. మండల అధ్యక్షుడురామచంద్ర, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, కార్యదర్శులు ప్రశాంత్, అమర, శ్రీకాంత్, రేవంత్, రమేష్, రాజేష్, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మరుగుదొడ్ల ప్రారంభం

బి.కొత్తకోట, మే13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జ్యోతి సర్కిల్‌లో ఏళ్ల తరబడి ఉన్న ఆక్రమణలను తొలగించి నిర్మించిన మరుగుదొడ్లను బుధవారం ప్రారంభించ నున్నట్లు నగరపంచాయతీ కమిషనర్ జీవీ పల్లవి తెలిపారు. ఈ మరుగుదొడ్ల నిర్మా ణాన్ని అడ్డుకునేందుకు పలువురు పలు విధాలుగా ప్రయత్నించినా, ఎన్ని వత్తిడులు వచ్చినా కమిషనర్ పల్లవి గట్టిగా నిలిచి నిర్మాణాలు చేపట్టారు. నేడు వాటిని ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నారు.

గృహనిర్మాణ పనులు పర్యవేక్షించండి : హౌసింగ్ ఈఈ



సిబ్బందితో మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ రమేష్‌రెడ్డి, డీఈ వెంకటరెడ్డి

పెద్దతిప్పసముద్రం మే 13 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన గృహనిర్మాణ పనులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా నిలిచి పోకూడదనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం అధనపు నిధులు మంజూరు చేసినా గృహనిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని హౌసింగ్ ఈఈ రమేష్‌రెడ్డి, డీఈ వెంకటరెడ్డి అన్నారు. హౌసింగ్ ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరైన గృహాలకు అప్పటి ప్రభుత్వం అందించే సొమ్ము చాలక పోవడంతో పనులు ఎక్కడికక్కడే నిలిచి పోయాయన్నారు. దీంతో కూటమి ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేసి తక్షణం పనులు ప్రారంబించాలని ప్రభుత్వం ఆదేశించింది. హౌసింగ్ సిబ్బంది తక్షణం క్షేత్ర స్థాయిలోకి వెళ్లి గృహనిర్మాణాలు పూర్తి చేయించాలని ఆదేశించారు.

టమోటా రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): టమోటా రైతులను ఆదుకోవాలని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... మదనపల్లె మార్కెట్ యార్డులో నిబంధనలను అతిక్రమించి మండీ యజమానులు రైతుల నుంచి 10 శాతం కమీషన్ తీసుకుంటున్నారని ఆరోపించారు. టమోటా ధరలు అంతంత మాత్రమే పలుకుతుండటంతో నష్టపోతున్న రైతుల నుంచి మండీ యజమానులు ముక్కు పిండి 10శాతం కమిషన్ వసూలు చేస్తున్నారన్నారు.వంద బాక్సులకు పది బాక్సులు చొప్పున జాక్‌పాట్ తీసుకుంటున్నారన్నారు. దీనిపై ఎమ్మెల్యే షాజహాన్‌బాషా జోక్యం చేసుకుని టమోటా రైతులను ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో రైతులు రాజన్న, ప్రభాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీ నేత చొరవతో నిరుపేద కుటుంబానికి న్యాయం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు/తంబళ్లపల్లి,మే 13(ఆంధ్రజ్యోతి): పని చేస్తున్న సంస్థ లావాదేవీల విషయంలో ఆరోపణలు చేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న యువకుడి కుటుంబానికి తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జి చొరవతో సంబంధిత కంపెనీ రూ.5 లక్షలు పరిహారం అందజేసింది. మండలంలోని గుండపల్లె పంచాయతీ చెట్టవారిపల్లెకు చెందిన పెద్ద వీరభద్ర, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు నవీన్‌కుమార్ రెడ్డి (24) మండలకేంద్రంలోని పుడమి కిసాన్‌మార్టులో పని చేసేవాడు. మార్చి 20న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు సహాయం అందేలా చర్యలు తీసుకున్నారు. ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం మృతుడి తండ్రి పెద్దవీరభద్రకు రూ.5లక్షల చెక్కును కంపెనీ ప్రతినిధులతో కలిసి అందజేశారు. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన, మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, నాయకులు బేరి శ్రీనివాసులు, కాలా నారాయణ, కంపెనీ ప్రతినిధులుకృష్ణరామిరెడ్డి, వెంకటప్రసాద్, మహమ్మద్ ఆరీఫ్ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌లో వంద శాతం ఉత్తీర్ణత

కలికిరి, మే 13 (ఆంధ్రజ్యోతి): మంగళవారం విడుదలయిన సీబీఎస్‌ఈ ఫలితాల్లో కలికిరి సైనిక్ స్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు సమాచారం. పదవ తరగతితో పాటు ప్లస్ 2 ఫలితాలకు సంబంధించి పాఠశాల వారీగా ఉత్తీర్ణత వివరాలు ఇంకా రానప్పటికీ విద్యార్థులు విడివిడిగా తమ ఫలితాలను తెలుసుకోవచ్చు. కలికిరి సైనిక్ స్కూల్లో పదవ తరగతిలో 97 మంది, ప్లస్ 2లో 64 మంది పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఇక విద్యార్థికి సంబంధించిన హాల్ టికెట్టు నంబరుతోపాటు ఇంటిపేరుతో సహా తల్లిపేరు, పుట్టిన తేదీ వివరాలు నమోదు చేస్తే మార్కులతో సహా ఫలితం వెల్లడవుతుంది.

ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న ఉర్దూ అకాడమీ ఉద్యోగులు, బాషాభిమానులు

వాల్మీకిపురం, మే 13(ఆంధ్రజ్యోతి): ఉర్దూ భాషాభివృద్ధికి అందరం కలిసి పనిచేద్దామని విశ్రాంత హెచ్‌ఎం జవాద్ హుస్సేన్ పిలుపునిచ్చారు. చలో లైబ్రరీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మంగళవారం ఉర్దూ అకాడమీ ఉద్యోగులు, భాషాభిమానులు, యువత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉర్దూ అకాడమీ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉర్దూ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఉపాధ్యాయులను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాలలో ఉర్దూ భాష రెండవ అధికార భాషగా కొనసాగుతోందని గుర్తు చేశారు. దేశంలో ఇతర భాషలతో పాటు ఉర్దూకు కూడా విడదీయరాని బంధం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సయ్యద్‌బాషా, చాను, కువైట్‌బాబు, హనీఫ్, సాదిక్, అషర్, మొహ్మద్‌అలి, సుఫియాన్, యూసుఫ్, జావీద్, భాషాభిమానులు, ఉర్దూ అకాడెమి ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు శుభాకాంక్షలు



హజ్ యాత్రికులతో రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు పఠాన్ ఖాదర్‌ఖాన్

మదనపల్లె, మే 13(ఆంధ్రజ్యోతి): రాయ లసీమ జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న వారు క్షేమంగా తిరిగి రావాలని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు పఠాన్ ఖాదర్‌ఖాన్ ఆకాంక్షిం చారు. రాయలసీమ జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న వారికి బెంగళూరు హజ్ భవనంలో రాష్ట్ర ప్రభుత్వం తరపునఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రతినిధులతో కలిసి దగ్గరుండి పరిశీలించి యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల ప్రత్యేక సలహాదారులు ఎంఏ షరీఫ్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హసన్‌బాషాలతో కలిసి స్కానింగ్, బ్యాగ్ ప్యాకింగ్, లోడింగ్, ట్యాగింగ్, రూం అలాట్‌మెంట్, ఫుడ్ టోకన్స్ తదితర సౌకర్యాలను దగ్గరుండి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు టీడీపీ నాయకుడు, సామాజికవేత్త సోహెల్ బాషా, సాజిద్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి

మదనపల్లె అర్బన్, మే13(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశ పెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధి కార ప్రతినిధి డాక్టర్ అప్పినపల్లె భాస్కరాచారి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జనాభా గణనతోపాటు బీసీకుల గణన చేయాలన్నారు. పంచాయతీ రాజ్ సంస్థలో బీసీ రిజర్వేషన్ 34 నుంచి 52 శాతానికి పెంచాలని కోరారు అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు వందశాతం పెంచాలని కోరారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలన్నారు. బీసీల విద్యాభివృద్ధి కోసం స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రతి ఇంటికి రూ. 10 లక్షల నుంచిరూ. 50 లక్షల వరకు 80 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయా లని కోరారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

అన్నదాత పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి

కలకడ, మే 13(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ కోసం అర్హులైన రైతులు ఈ నెల 20వ తేదీలోగా అన్నదాత పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఎంఏవో లావణ్య కోరారు. దీని ద్వారా రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం అందుతుందన్నారు. మూడు విడతల్లో రాష్ట్రం రూ.14 వేలు, కేంద్ర రూ.6 వేలు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తుందన్నారు. ఇందు కోసం రైతులు ఆధార్ నెంబరు, వెబ్‌ల్యాండ్ సమాచారాన్ని నిర్ధారించుకొని, ఈకేవైసీ చేయించుకోకపోతే ప్రక్రియను రైతు సేవా కేంద్రాల్లో పూర్తి చేసుకోవాలని కోరారు.

వైభవంగా మారెమ్మ తిరునాళ్లు

కురబలకోట, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివేడు సమీపంలో మంగళవారం మారెమ్మ తిరునాళ్ల నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చాందినీ బండ్లను ఊరేగించారు. పలువురు భక్తులు మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉట్లోత్సవం ఆకట్టుకుంది.

టపాసులు పేలి బాలుడికి గాయాలు

మదనపల్లి మే 13 (ఆంధ్రజ్యోతి) టపాసులు పేలి ఓ బాలుడికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని సి.గొల్లపల్లి గ్రామ పంచాయతీ బుసిరెడ్డిగారిపల్లికి చెందిన రఘునాథరెడ్డి కొడుకు ధనుష్‌రెడ్డి (12) సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలసి పెద్దమండ్యం మండలంలోని రెక్కలకొండలో జరుగుతున్న మల్లాలమ్మ తిరునాళ్లకు వెళ్లాడు. ఉత్సవాల్లో భాగంగా టపాసులు పేలుస్తుండగా, వాటి నుంచి వెలువడిన నిప్పురవ్వలు పక్కనే నిద్రిస్తున్న బాలుడిపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగుళూరు తరలించినట్లు పోలీసులు తెలిపారు.